ఆదివారం
28-08-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 68
పేజీలు : 8, వెల: రూ.6.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23

అక్షరాక్షరం అభ్యుదయం

కమ్యూనిస్టుల పునరైక్యత అవశ్యం

- ప్రజా సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతున్న కేంద్రం
- రాజకీయ లబ్ధికే ప్రజల మధ్య చిచ్చు
- మోదీ సర్కారును సాగనంపేందుకు అందరూ ఏకం కావాలి
- సీపీఐ రాష్ట్ర మహాసభల్లో రాజా ఉద్ఘాటన

2లో

కమ్యూనిస్టుపార్టీల పునరైక్యత అత్యంత అవశ్యమని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా ఉద్ఘాటించారు. నియంతృత్వ, పాశవిక మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించడానికి వామపక్ష, లౌకిక, ప్రజాతంత్ర శక్తులన్నీ ఏకం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

చట్టసభల్లో అడుగు పెట్టేలా

ఉధృత ఉద్యమాలు

- సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేయాలి
- దేశంలో ప్రమాదకర రాజకీయాలు
- కార్యదర్శి నివేదిక ప్రవేశపెడుతూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో– విశాఖపట్నం: కమ్యూనిస్టులు చట్టసభల్లో అడుగుపెట్టే విధంగా ఉద్యమాలను ఉధృతం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. విశాఖపట్నంలో జరుగుతున్న సీపీఐ రాష్ట్ర 27వ మహాసభలు రెండో రోజు ప్రతినిధుల సభలో రామకృష్ణ కార్యదర్శి నివేదికను ప్రవేశపెడుతూ, దేశంలో ప్రమాదకర రాజకీయాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దేశం బాగుండాలంటే చట్టసభల్లోకి కమ్యూనిస్టులు వెళ్లాలని, ఆ వైపుగా మన ఉద్యమాలు ఉండాలన్నారు. గ్రామస్థాయి నుంచి పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేసుకోవాలని సూచించారు. 2019 ఎన్నికల అనంతరం ఆర్ఎస్ఎస్ అజెండాను బీజేపీ నిస్సిగ్గుగా అమలు చేస్తున్నదన్నారు. దీంతో మతతత్వ రాజకీయాలు పెరిగాయనీ, కులాల మధ్య చిచ్చు పెడుతున్నారని అన్నారు. ప్రభుత్వ రంగాన్ని కార్పొరేట్ వ్యక్తులకు దోచిపెడుతున్నారని విమర్శించారు. సంక్షేమాన్ని పక్కదారి పట్టించడానికి ఉచితాలంటూ కోర్టుకెళ్లిన బీజేపీ నాయకుడు...10 వేల కోట్ల

- మిగతా 2 లో

మహాసభలో రామకృష్ణ, రాజా, మానం, నారాయణ, కూనంనేని, రావుల తదితరులు

కొత్త కార్మిక చట్టాలు రద్దు చేయాల్సిందే

- 4 కోడ్‌లతో కార్మికశక్తికి హాని
- ప్రధాని అబద్ధపు ప్రచారానికి ఏఐటీయూసీ ఖండన

న్యూఢిల్లీ : కొత్త కార్మిక చట్టాలను రద్దు చేయాల్సిందేనని ఏఐటీయూసీ డిమాండు చేసింది. వీటిని రద్దు చేసే వరకు విశ్రమించేది లేదని, మరింత ఉధృతంగా పోరాడ తామని సంకల్పించింది. కార్మికుల సాధికారతకు కార్మిక కోడ్‌లు దోహదమవుతాయని ప్రధాని మోదీ ఇటీవల తిరుపతిలో నిర్వహించిన జాతీయ కార్మిక సదస్సులో ఉద్ఘాటించడాన్ని ఏఐటీయూసీ తీవ్రంగా ఖండించింది. మోదీ అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టింది. 25 కోట్ల మంది కార్మికులు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా మార్చి 28,29 తేదీల్లో దేశవ్యాప్త సమ్మె నిర్వహించడాన్ని గుర్తుచేసింది. 90శాతానికిపైగా కార్మికశక్తికి హానికరమైన

- మిగతా 2 లో

ఐక్య ఉద్యమాలు బలపడాలి

పీజే చంద్రశేఖరరావు ఆకాంక్ష

విశాలాంధ్ర బ్యూరో–విశాఖపట్నం : దేశంలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో కమ్యూనిస్టుల ఐక్యత అవసరమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పీజే చంద్రశేఖర రావు ఆకాంక్షించారు. సీపీఐ 27వ రాష్ట్ర మహాసభల సందర్భంగా రెండవ రోజు ప్రతినిధుల సభలో ప్రారంభోత్సవానికి ముందు అరుణ పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనం తరం జరిగిన సభలో చంద్రశేఖరరావు మాట్లాడుతూ ప్రపంచ కార్మికులు కాదు... ముందు కమ్యూనిస్టులు ఏకం కావాలని హితవు పలికారు. వామపక్షాల కలయిక కోసం జనం ఎదురుచూస్తున్నారని చెప్పారు. నాడు స్వాతంత్ర్యం కోసం పోరాడిన ఎర్రజెండా నేడు ప్రజలకు అండగా నిలుస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఉధృత ఉద్యమాల ద్వారానే తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. 2024 ఎన్నికలలో మోదీని నియంత్రించాలంటే ఇప్పటి నుంచే వామపక్ష ఐక్య ఉద్యమాలు బలపడాలని ఆకాంక్షించారు. వామపక్షాలకు ఇది పరీక్షా సమయమని, సవాళ్లను దీటుగా ఎదుర్కోవాలని సూచించారు.

అమరవీరుల స్థూపానికి నివాళులర్పిస్తున్న నెక్కంటి సుబ్బారావు

తగ్గేదే లేదు...

- 1న ఆందోళన యథాతథం
- సీపీఎస్‌పై సర్కారు సాగదీత
- పోలీసుల అత్యుత్సాహం
- జిల్లాల వారీగా కొనసాగుతున్న నిర్బంధాలు
- ఉద్యోగులు, ఉపాధ్యాయుల వాహనాల స్వాధీనం

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) రద్దును వ్యతిరేకిస్తూ ఉద్యమానికి ఉద్యోగులు సన్నద్ధమయ్యారు. పదేపదే ప్రభుత్వంతో జరుగుతున్న చర్చలు విఫలం కావడంతో వారంతా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల విజయవాడలో ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణతో నిర్వహించిన చర్చలు విఫలమయ్యాయి. సీపీఎస్ రద్దుపై

- మిగతా 2 లో

తుపాకీ పట్టిన చేతితోనే కలం ఝుళిపించిన

డా. రాజ్ బహదూర్ గౌర్



తెలంగాణ సాయుధ పోరాటం అంతమైన తరవాత 1952లో డా. రాజ్ బహదూర్ గౌర్ జైలులో ఉండగానే రాజ్యసభకు ఎన్నికయ్యారు. "రాజ్ బహదూర్ అడవి మనిషి, ఆయుధాలతో పట్టుబడ్డాడు కనక విడుదల చేయడానికి వీలు లేదు"అని గోపాల స్వామి అయ్యంగార్ లాంటి వారు వాదించారు. "ప్రతి సాధువుకు ఓ గతం ఉంటుంది. ప్రతి నేరస్థుడికి ఓ భవిష్యత్తు ఉంటుంది"అని రాధాకృష్ణన్ రాజ్ బహదూర్ విడుదలకు దోహదం చేశారు. ఎన్నికల నాటికి సాయుధ పోరాటం అంతమైంది. జైళ్లలో ఉన్న కమ్యూనిస్టు నాయకులు విడుదలయ్యారు. మొదటి సార్వత్రిక ఎన్నికలలో పోటీ కూడా చేశారు. రాజ్ మాత్రం విడుదల కాలేదు. కానీ జైలు నుంచే నామినేషన్ దాఖలు చేశారు. ఆయన పేరు ఓటర్ల జాబితాలో లేనందువల్ల నామినేషన్ తిరస్కరించారు.

ఆయన నడుస్తుంటే హైదరాబాద్ చరిత్ర నడిచినట్టు ఉండేది. బహుశా ఆయన దక్కనీ తహజీబ్ (దక్కనీ సంస్కృతి)కు ఆఖరి ఆనవాలు. ఆయనది కార్మికోద్యమానికి అలవాటుపడ్డ ప్రాణం. కాని ఆయన సాహిత్యాభిరుచి అవధులు లేనిది. కార్మికోద్యమంలో, తెలంగాణ సాయుధ పోరాటంలో, కమ్యూనిస్టు పార్టీ కార్యకలాపాల్లో తీరిక లేకుండా ఉన్నా సాహితీ సృజన ఆగలేదు. ఆయనే డా. రాజ్ బహదూర్ గౌర్ (1918 జులై 21-2011 అక్టోబర్ 7). రాజ్ బహదూర్ గౌర్ పూర్వీకులు ఉత్తరప్రదేశ్ లోని ఫైజాబాద్ జిల్లా గోషైన్ గంజ్ తాలుకా కిషన్ పూర్ గ్రామానికి చెందిన వారు. ఆయన తాత 1850 ప్రాంతంలో హైదరాబాద్ వచ్చి గాలిబుల్ ముల్క్ గాలిబ్ జంగ్ దగ్గర ఉద్యోగం చేసి హైదరాబాద్ లోనే స్థిరపడ్డారు. డా. రాజ్‌బహదూర్ కుటుంబం హైదరాబాద్ పాతబస్తీలోని గౌలీ పురాలో నివాసం ఉండేది. ఆయన విద్యాభ్యాసం పాత బస్తీలోని ముఫీద్–ఉల్–అనాం, ధర్మవంత్, రిఫా–ఎ–ఆం పాఠశాలల్లో సాగింది. కాయస్థుల మాతృ భాష ఉర్దూ. రాజ్ బహదూర్ ఆరో తరగతి దాకా ఉర్దూ మాధ్యమంలోనే చదువుకున్నారు. ఏడో తరగతిలో చాదర్‌ఘాట్‌లోని ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీషు మాధ్యమంలో చేరారు. కాని వైద్య విద్య మాత్రం ఉర్దూ మాధ్యమంలోనే సాగింది.

అప్పుడు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో వైద్య శాస్త్రం కూడా ఉర్దూ మాధ్యమంలోనే బోధించే వారు. తన తల్లి భాష ఉర్దూ అయితే సవతి తల్లి భాష ఇంగ్లీషు అని రాజ్ బహదూర్ చమత్కరించే వారు. వైద్య శాస్త్రంలో పట్టభద్రుడైనా ఆయన ఆ వృత్తిలో కొనసాగలేదు. విద్యార్థి దశలోనే ఉండగానే రాజకీయాల మీద ఆయనకు దృష్టి మళ్లింది. నిరంతర విప్లవకారుడిగా ఉండడమే ఆయన వృత్తి. సాహిత్య రచన ఆయన ప్రవృత్తి. అప్పటికి హైదరాబాద్ సంస్థానంలో రాజకీయ పార్టీలు ఏవీ లేవు. తెలుగు భాష, సంస్కృతిని పరిరక్షించడానికి 1922 నుంచి ప్రయత్నాలు ప్రారంభమైనా 1930లో ఆంధ్ర మహాసభ ఏర్పాటుతో ఆ ప్రయత్నాలు నిర్దిష్ట రూపం సంతరించుకున్నాయి. అంతకు ముందునుంచే ఆర్య సమాజం పౌరహక్కుల కోసం ఉద్యమిస్తుండేది. సహజంగానే రాజ్ బహదూర్ ఆర్య సమాజం వేపు ఆకర్షితులయ్యారు. 1937–38లో రాజ్ బహదూర్ స్టేట్ కాంగ్రెస్ లో ఉన్నారు. సత్యాగ్రహం మీద అభిమానం కలిగింది. సత్యాగ్రహం చేయాలను కున్నారు కాని గాంధీ సత్యాగ్రహోద్యమాన్ని

- మిగతా 3 లో

వైసీపీకి అసమ్మతి సెగ

- గుంటూరులో ఏలుతున్న నేత
- సీఎంకు ఫిర్యాదు వెళ్లినా మౌనం
- నాడు సుచరితకు, నేడు శ్రీదేవికి ఎసరు!
- తాడికొండలో రచ్చకెక్కిన విభేదాలు
- జగ్గయ్యపేట పట్టణ అధ్యక్షుడి రాజీనామా

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: అధికార వైసీపీలో చిచ్చు రేగుతోంది. రోజురోజుకూ అసమ్మతులు ఎక్కువై పోతున్నాయి. ఇటీవల మంత్రివర్గ విస్తరణ అనంతరం నేతల మధ్య విభేదాలు తారాస్థాయిని అందుకుంటున్నాయి. పార్టీలోకి వచ్చిన కొత్త నేతలు, పార్టీ స్థాపించినప్పటి నుంచి ఉన్న నేతల మధ్య విభేదాలు రచ్చకెక్కుతున్నాయి. చాలా జిల్లాల్లో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేల మధ్య సమన్వయం కొరవడింది. తాజాగా గుంటూరుజిల్లా తాడికొండ నియోజకవర్గం వివాదం పార్టీ అధినేతకు తలనొప్పిగా మారింది. ఈ జిల్లాలో ఓ ప్రజాప్రతినిధి చెప్పిందే వేదంగా కొనసాగుతోంది. తనను ఎదిరించిన వారిని సాగనంపి, ప్రత్యామ్నాయంగా మరొకరికి పదవులు అప్పగించడమే ఆయన వైఖరి. పార్టీ

- మిగతా 2 లో

కొత్త సీజేఐ యూయూ

లలిత్ ప్రమాణం

- 74 రోజులే పదవీ కాలం - నవంబరు 8న పదవీ విరమణ
- తండ్రి, కుటుంబ సభ్యుల ఆశీర్వచనాలతో నూతన బాధ్యతల్లోకి...

2 లో

పాకిస్తాన్‌లో వరద బీభత్సం

937 మంది మృతి

ఇస్లామాబాద్: అత్యంత భారీ వర్షాలతో పాకిస్తాన్ అతలాకుతలం అవుతోంది. వరదల ధాటికి దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 343 మంది చిన్నారులతో సహా 937 మంది ప్రాణాలు కోల్పోయారు. దాదాపు మూడు కోట్ల మంది నిరాశ్రయులయ్యారు. దీంతో పాక్ ప్రభుత్వం గురువారం జాతీయ అత్యవసర పరిస్థితి ప్రకటించింది. అత్యధికంగా సింధ్ ప్రావిన్స్ లో 306 మంది ప్రాణాలు కోల్పోయారని ఇక్కడి జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ వివరాలు తెలిపాయి. బలూచిస్తాన్‌లో 234 మరణాలు నమోదయ్యాయి. ఖైబర్ పఖ్తుంఖ్వాలో 185, పంజాబ్ ప్రావిన్స్‌లో 165 మంది మృతి చెందారు. పాకిస్తాన్‌లో ఏటా ఆగస్టులో సాధారణ వర్షపాతం 48 మిల్లీమీటర్లు కాగా ఈ ఏడాది దాదాపు 241 శాతం అధికంగా 166.8 మిల్లీమీటర్లు నమోదు అయింది. వరదలతో అస్తవ్యస్తమైన సింధ్, బలూచిస్తాన్‌లో ఏకంగా 784 శాతం, 496 శాతం అధిక వర్షపాతం నమోదైంది. కుండపోత వర్షాలు ఆకస్మిక వరదలకు కారణమయ్యాయని పాక్ వాతావరణ మార్పులశాఖ మంత్రి షెర్రీ రెహమాన్ తెలిపారు. వరద పరిస్థితులపై శనివారం ఆమె మాట్లాడారు. సహాయక చర్యల సమన్వయానికి ఎన్‌డీఎంఏలో ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్ 'వార్ రూమ్'ని ఏర్పాటు చేశారని చెప్పారు. 2010 నాటి వరదలతో పోలిస్తే.. దేశంలో ప్రస్తుత పరిస్థితులు అంతకంటే దారుణంగా ఉన్నాయన్నారు.

'భారీ వర్షాలు, ఆకస్మిక వరదలతో దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఇళ్లు, రోడ్లు, వంతెనలు కొట్టుకుపోయాయి. కమ్యూనికేషన్ వ్యవస్థ ధ్వంసమైంది. దాదాపు మూడు కోట్ల మంది నిరాశ్రయులయ్యారు. ఎడతెగని వర్షాలతో సహాయక చర్యలు కష్టతరంగా మారాయి' అని మంత్రి తెలిపారు. ఈ నేపథ్యంలో వరద బాధితులను ఆదుకునేందుకు అంతర్జాతీయంగా దాతలు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. 'ఒక్క సింధ్ ప్రావిన్స్‌లోనే ప్రజలకు తాత్కాలిక ఆశ్రయం కల్పించేందుకు పది లక్షల టెంట్‌లు అవసరం. అదే బలూచిస్తాన్‌లో లక్ష కావాలి. ఈ క్రమంలోనే వాటి సమీకరణకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం' అని చెప్పారు.

బ్రిటన్‌లో పోస్టల్ ఉద్యోగుల సమ్మె

లండన్: బ్రిటన్‌లో 1.70 లక్షల మంది టెలికాం, పోస్టల్ ఉద్యోగులు ప్రారంభించిన సమ్మె విజయవంతంగా జరుగుతోంది. వేతన పెంపుదల, బోనస్ విషయమై ఉద్యోగులు శుక్రవారం నుంచి ఆరు రోజులపాటు కొన్ని ఎంపిక చేసిన చోట్ల సమ్మె నిర్వహిస్తున్నారు. సమస్యలపై ప్రభుత్వ మొండివైఖరి కారణంగా సమ్మె అనివార్యమైందని ఉద్యోగ సంఘాల నాయకులు తెలిపారు. ఈ ఏడాది మే3 తరువాత పోస్టల్ కార్మికుల సమ్మె చేయడం ఇది వరుసగా నాల్గవసారి. ఉద్యోగులు 13 శాతం వేతన పెంపుదల కోరుతుంటే, ప్రభుత్వం 5 శాతం మాత్రమే పెంచుతామని అంటోంది. బోనస్ విషయం మాట్లాడడం లేదు. ప్రభుత్వ మొండివైఖరి వల్లే సమ్మె అనివార్యమైందని కమ్యూనికేషన్ వర్కర్స్ యూనియన్ నాయకులు చెప్పారు. ఈ జాతీయ సమ్మెలో లక్షా 15వేల మంది పోస్టల్ ఉద్యోగులు ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. వీరు ఆగస్టు 26 నుంచి 31 మధ్య, సెప్టెంబరు 8, 9 తేదీల్లో 1500 పని ప్రదేశాల్లో సమ్మె చేయనున్నారు.

రాయల్ మెయిల్ సిబ్బంది జాతీయ సమ్మెకు పూనుకోవడం 2009 తరువాత ఇదే ప్రథమం. 40,000మంది టెలికాం ఉద్యోగులు, కాల్ సెంటర్ సిబ్బంది, ఇంజినీర్లు ఈ నెల 30, 31 తేదీల్లో క్రౌన్ ఆఫీసుల వద్ద సమ్మె చేయనున్నారు. అడ్మినిస్ట్రేషన్, సప్లయి చైన్‌కు సంబంధించిన సిబ్బంది ఈ నెల 26, 27, 30 తేదీల్లో సమ్మె చేస్తున్నారు. కమ్యూనికేషన్ వర్కర్ యూనియన్ కార్యదర్శి దావే వార్డ్ ఈ ప్రత్యక్ష కార్యాచరణను సమన్వయం చేస్తున్నారు. పోస్టల్,టెలికాం వర్కర్లు ఒకే విధమైన దాడిని ఎదుర్కొంటున్నప్పటికీ మూడు సెక్షన్ల కార్మికులు కలసి ఒకేసారి సమ్మె చేయడం కుదరదు కనుక వేర్వేరు తేదీల్లో , విభిన్న చోట్ల సమ్మెలు నిర్వహించాల్సి వస్తోంది.

ఘోర తప్పిదాన్ని సరిదిద్దుకోండి

- ఆ 11 మందిని తిరిగి జైలుకు పంపండి
- బిల్కిస్ బానో కేసుపై సీజేఐకి 134 మంది
- మాజీ బ్యూరోక్రాట్ల బహిరంగ లేఖ

న్యూదిల్లీ : దేశవ్యాప్తంగా సంచలనంగా మారిన బిల్కిస్ బానోపై సామూహిక అత్యాచారం, ఆమె కుటుంబ సభ్యుల హత్య కేసులో 11 మంది దోషులకు విముక్తి కల్పించడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. అతికిరాతంగా వ్యవహరించిన వ్యక్తులకు శిక్ష మాఫీ చేయడం ఏమిటన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఇది కేవలం రాజకీయ లబ్ధి కోసం గుజరాత్‌లో ఎన్నికల దృష్ట్యా తీసుకున్న నిర్ణయం అన్న వాదన బలంగా వినిపిస్తోంది. ఇదే క్రమంలో 134 మంది మాజీ బ్యూరోక్రాట్లు కూడా బిల్కిస్ బానో దోషులను విడుదల చేయడాన్ని తీవ్రంగా ఆక్షేపించారు. ఇది ఘోరమైన తప్పుడు నిర్ణయమని, దీనిని వెంటనే సరిదిద్దుకోవాలని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)కి సూచిస్తూ బహిరంగ లేఖ రాశారు. గుజరాత్ ప్రభుత్వ ఉత్తర్వులను రద్దు చేసి ఆ 11 మందిని తిరిగి జైలుకు పంపాలని, శిక్ష పూర్తి అయ్యేంత వరకు విముక్తి కల్పించరాదని సూచించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు కావడాన్ని పురస్కరించుకొని గుజరాత్ ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం దేశంలోని మిగతా వారిలానే తమనూ నిర్ఘాంతపర్చిందని పేర్కొన్నారు. లేఖ రాసిన వారిలో దిల్లీ మాజీ లెఫ్టినెంట్ గవర్నర్ నజీబ్ జంగ్, కేబినెట్ మాజీ కార్యదర్శి కేఎం చంద్రశేఖర్, విదేశాంగ శాఖ మాజీ కార్యదర్శులు శివశంకర్ మీనన్, సుజాతా సింగ్, హోంశాఖ మాజీ కార్యదర్శి జీకే పిళ్లైతో సహా 134 మంది మాజీ బ్యూరోక్రాట్లు 'కాన్‌స్టిట్యూషనల్ కాండక్ట్ గ్రూపు'గా లేఖ రాశారు. దోషులను విడుదల చేయడం కలచివేసింది కాబట్టే మీకు లేఖ రాస్తున్నాం' అని నూతన సీజేఐ లలిత్‌నుద్దేశించి పేర్కొన్నారు. 'ఇది చాలా అరుదైన కేసు. రేపిస్టులు, హంతకులే కాదు సాక్ష్యాలను తారు మారు/మాయం చేసి నేరస్తులను కాపాడేందుకు ప్రయత్నించిన పోలీసులకు, వైద్యులకూ శిక్షలు పడ్డాయి. దోషుల్లో ఒకరైన రాధేశ్యామ్‌షా 15 ఏళ్లు జైల్లో ఉన్న తర్వాత ముందస్తు విడుదల కోసం అర్జీ పెట్టుకున్నాడు. గుజరాత్ హైకోర్టు గతంలో ఇటువంటి ఫిర్యాదును తిరస్కరించింది. దీనిపై నిర్ణయం తీసుకోవాల్సినది మహారాష్ట్ర ప్రభుత్వమేగానీ గుజరాత్ కాదని కోర్టు పేర్కొంది. ఆ తర్వాత సుప్రీంకోర్టును రాధేశ్యామ్ ఆశ్రయించగా దీనిపై రెండు నెలల్లోగా గుజరాత్ ప్రభుత్వం స్పందించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ వ్యవహారంలో సుప్రీంకోర్టు అంత తొందరపాటు ఎందుకని ప్రశ్నించింది? తక్షణమే పరిశీలించాలిన వ్యవహారంగా ఎందుకని భావించింది? రెండు నెలల్లో చర్యలకు ఆదేశాలివ్వడంలో మర్మమేమిటి? గుజరాత్ 1992 రిమిషన్ విధానం ప్రకారం ఈ కేసును పరిశీలించాలేగానీ ప్రస్తుత విధానం ప్రకారం కాదు.' అని లేఖ పేర్కొంది. 'మైనారిటీ కుటుంబానికి జరిగిన అన్యాయాన్ని దృష్టిలో పెట్టుకుంటూ ఈ లేఖను రాస్తున్నాం. మీరు చేసినది ఘోరమైన తప్పిదమని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు. దీనిని తక్షణమే సరిదిద్దుకోవాలి. ఆ 11 మందిని వారి శిక్షను పూర్తి చేసేందుకు తిరిగి జైలుకు పంపాలి' అని మాజీ బ్యూరోక్రాట్లు పేర్కొన్నారు. కాగా, ఈనెల 25న 11 మంది దోషుల విడుదలపై వివరణ ఇవ్వాలంటూ కేంద్రానికి, గుజరాత్ ప్రభుత్వానికి నోటీసులను సుప్రీంకోర్టు జారీ చేసిన విషయం విదితమే.

వైసీపీకి అసమ్మతిసెగ

(మొదటిపేజీ తరువాయి)

బలోపేతానికని ఆయనకు కీలక బాధ్యతలు అప్పగిస్తే... సొంత అజెండా, వర్గంతో ముందుకు పోవడంపై సర్వత్రా విమర్శలు నెలకొంటున్నాయి. నిన్న గాక మొన్న పునర్వ్యవస్థీకరణలో హోంమంత్రి మేకతోటి సుచరితకు తిరిగి మంత్రి పదవి ఇవ్వకుండా చేయడంలో సదరు నేత కీలకంగా నిలిచినట్లు ప్రచారముంది. ఇప్పుడు తాడికొండ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవికి నియోజకవర్గంలో అదనపు సమన్వయకర్తగా డొక్కా మాణిక్యవరప్రసాద్‌ను నియమించడంలో ఆయన చక్రం తిప్పినట్లు స్పష్టమవుతోంది. ఇద్దరు దళిత, మహిళా ప్రజాప్రతినిధుల అణచివేతకు సదరు వైసీపీ ప్రజాప్రతినిధి వ్యవహరిస్తున్న తీరు అధికార పార్టీలో చర్చనీయాంశమైంది. అధినేత జగన్ ఇప్పటికైనా సదరు నేతకు అధికారాలు, బాధ్యతలు తగ్గించి, క్రమశిక్షణ చర్యలు తీసుకుంటే పార్టీకి మేలు జరుగుతుందని కార్యకర్తలు సూచిస్తున్నారు.

ఉండవల్లి శ్రీదేవికి టికెట్ దక్కేనా?

రాబోయే ఎన్నికల్లో తాడికొండ ఎమ్మెల్యేకి తిరిగి వైసీపీ టికెట్ ఇస్తుందా అనేది ప్రశ్నార్థకంగా మారింది. తాడికొండకు ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్‌ను అదనపు సమన్వయకర్తగా నియమించడంతో విభేదాలు రచ్చకెక్కాయి. ఇద్దరు నేతలు పరస్పరం విమర్శలు గుప్పించుకుంటున్నారు. డొక్కాకు అదనపు బాధ్యతల్ని ఇవ్వడాన్ని నిరసిస్తూ, ఇటీవల వైసీపీ గుంటూరుజిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి మేకతోటి సుచరిత ఇంటి ముందు ఉండవల్లి శ్రీదేవితోపాటు ఆమె అనుచరులు నిరసనకు దిగారు. ఆ విషయాన్ని పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లి, సమస్యను పరిష్కరిస్తానని సుచరిత హామీ ఇవ్వడంతో వారు నిరసన విరమించారు.

తాడికొండలో పోటాపోటీగా నిరసనలు

తాడికొండలో ఉండల్లి శ్రీదేవి, డొక్కా అనుచరులు శనివారం పోటాపోటీగా నిరసనలు చేపట్టారు. ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవికి మద్దతుగా ప్రదర్శనకు ఓ వర్గం సిద్ధమైంది. మరోపక్క డొక్కాకు అనుకూలంగా మరోవర్గం నినాదాలు చేసింది. రెండువర్గాల మధ్య మాటల యుద్ధం ముదిరి పరిస్థితి అదుపు తప్పుతుందనుకున్న తరుణంలో పోలీసులు రంగంలోకి దిగి రెండు వర్గాలతో చర్చలు మొదలుపెట్టారు. ఎలాంటి ప్రదర్శనలకు అనుమతి లేదని పోలీసులు స్పష్టం చేశారు. శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చూడాలని నచ్చజెప్పారు. తాడికొండలో ఎలాంటి సంఘటనలు జరగకుండా పోలీసులు భారీగా మోహరించారు.

జగ్గయ్యపేట పట్టణ అధ్యక్షుడి రాజీనామా

జగ్గయ్యపేట వైసీపీలోనూ విభేదాలు రచ్చకెక్కాయి. పార్టీ పట్టణ అధ్యక్ష పదవితో పాటు మున్సిపల్ కోఆప్షన్ సభ్యత్వానికి జగదీశ్ రాజీనామా చేయడంతో ఆ పార్టీకి షాక్ తగిలింది. మూడు నెలల క్రితం చౌడవరపు కుటుంబం నిర్వహణలో ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయం అనువంశిక హక్కులపై వివాదం చోటుచేసుకుంది. జగదీశ్‌తో పాటు అన్న కుమారుడు సాయికిషన్‌పై కేసు నమోదు చేశారు. పార్టీలో తనకు ప్రాధాన్యత లేదని జగదీశ్ ఆవేదన వ్యక్తం చేశారు. అమలాపురంలోనూ వైసీపీ నేతల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. మంత్రి విశ్వరూప్‌తో తమకు ప్రాణహాని ఉందని వైసీపీ నేత వాసంశెట్టి సత్యం ఆరోపిస్తున్నారు. మంత్రి విశ్వరూప్ తనకు కోట్లలో అప్పు ఉన్నారని, దానిని ఎగ్గొట్టేందుకే మమ్మల్ని చంపాలని ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు.

ఉధృత ఉద్యమాలు

(మొదటిపేజీ తరువాయి)

రూపాయలు కేంద్ర ప్రభుత్వం రద్దు చేస్తే ఎందుకు వెళ్లలేదని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడేది కమ్యూనిస్టులేనని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అక్టోబరు 14నుంచి 18వ తేదీ వరకు విజయవాడలో జరిగే సీపీఐ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని సూచించారు. పదివేల మంది రెడ్‌షర్ట్ వలంటీర్లు, వేలాదిమంది కళాకారులు, కార్యకర్తలతో మహా ప్రదర్శనకు హాజరుకావాలని పిలుపునిచ్చారు. మహాసభల విజయవంతం ద్వారా దేశ రాజకీయాల్లో మార్పు రావాలన్నారు. జాతీయ మహాసభలు దేశ రాజకీయాలకు దిక్సూచిగా మారాలని పేర్కొన్నారు.

వ్యవసాయం, సాంకేతికతకు ప్రాముఖ్యం : చైనా

నాన్జింగ్ : వ్యవసాయ శాస్త్రం, సాంకేతిక పరిజ్ఞానం ప్రాముఖ్యతను చైనా ప్రధాని లీ కెకియాంగ్ గురువారం నొక్కి చెప్పారు. వ్యవసాయ శాస్త్రం, సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రోత్సహించడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ ఆధునీకరణకు సైన్స్, టెక్నాలజీ ప్రాథమిక, నిర్ణయాత్మక శక్తులని పేర్కొన్నారు. సాంకేతికతలు, ప్రతిభను పెంపొందించడం, పురోగతిని సాధించడం ప్రాముఖ్యతను కూడా నొక్కిచెప్పారు. గత దశాబ్దంలో ఉపాధి, సామాజిక భద్రతలో చైనా ఘనమైన పురోగతి సాధించిందన్నారు. స్థిరమైన ఆర్థిక విస్తరణ, సామాజిక స్థిరత్వాన్ని పెంపొందిస్తూ ఉపాధి, సామాజిక భద్రతలో గత దశాబ్ద కాలంలో చైనా చారిత్రాత్మక విజయాలు సాధించిందన్నారు. 1.4 బిలియన్ల జనాభా ఉన్న దేశంలో స్థిరమైన జాబ్ మార్కెట్ ఏటా 13 మిలియన్లకు పైగా కొత్త ఉద్యోగాలను సృష్టించడం, పట్టణ నిరుద్యోగిత రేటును గత దశాబ్దంలో నియంత్రణ లక్ష్యాల కంటే తక్కువగా ఉంచడం వంటి విజయాలను ఆయన ఎత్తి చూపారు. చైనా ప్రజలు 10 సంవత్సరాల క్రితంతో పోలిస్తే ఇప్పుడు మెరుగైన వేతనాన్ని అందుకుంటున్నారు.

2012తో పోలిస్తే 2021లో పట్టణ ఉద్యోగుల జీతం రెట్టింపు అయిందని పేర్కొన్నారు. ఆర్థిక వ్యవస్థపై తగ్గుదల ఒత్తిడిని తగ్గించడానికి, వ్యాపార వ్యయాలను తగ్గించడానికి, ఉపాధిని స్థిరీకరించడానికి, చైనా ఇటీవలి సంవత్సరాలలో సామాజిక బీమా ప్రీమియంలను ఏడుసార్లు తగ్గించిందని మంత్రిత్వ శాఖలోని అధికారి క్విటావో విలేకరుల సమావేశంలో చెప్పారు. వృద్ధాప్య జనాభా, ప్రాంతీయ అసమానతలను పరిష్కరించడానికి, దేశం జాతీయ పెన్షన్ కార్యక్రమాన్ని అభివృద్ధి చేయడానికి ప్రయత్నాలను సమన్వయం చేస్తోంది.

తగ్గేదే లేదు...

(మొదటిపేజీ తరువాయి)

మంత్రులు చర్చించకుండా, తెరపైకి గ్యారెంటీ పెన్షన్ స్కీమ్ (జీపీఎస్) తేవడంపై ఉద్యోగులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. చర్చలు సాచివేత ధోరణితో కొనసాగుతున్నాయి. ప్రభుత్వం సీపీఎస్ ఉద్యోగుల ఉద్యమం అణచివేత చర్యలకు పాల్పడుతోంది. వారం రోజుల నుంచి జిల్లాల వారీగా సీపీఎస్ ఉద్యోగ సంఘాల నేతలు, ఉద్యోగుల వివరాలను పోలీసులు సేకరించి, వారికి నోటీసులు జారీజేస్తున్నారు. బలవంతపు నిర్బంధాలు, బైండోవర్ కేసులతో వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ప్రధాన నేతలను పోలీసుస్టేషన్లకు పిలిపించి, కేసులు నమోదు చేసి హెచ్చరికలు జారీజేస్తున్నారు. తాజాగా ఉపాధ్యాయుల ద్విచక్ర వాహనాలు, కార్లను పోలీసులు సీజ్‌చేసి, పోలీస్‌స్టేషన్లలో ఉంచుతున్నారు. దీనిపై ఉపాధ్యాయ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

పిలుపు సాకుతో ప్రభుత్వం అణచివేత చర్యలా?

సీపీఎస్ రద్దు కోసం సెప్టెంబరు 1న సీఎం ఇంటి ముట్టడి, చలో విజయవాడకు సీపీఎస్ ఉద్యోగ సంఘాలు వేర్వేరుగా ఆందోళనకు పిలుపునిచ్చాయి. వారికి ఉపాధ్యాయ సంఘాలు సంఘీభావం తెలిపాయి. అప్పటి నుంచి ప్రభుత్వం వ్యూహాత్మకంగా, ఉద్దేశపూర్వకంగా తమ ఉద్యమాన్ని అణచివేసే చర్యలకు పాల్పడుతోందని సీపీఎస్ ఉద్యోగ సంఘాల నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పిలుపులను ప్రభుత్వం అడ్డుపెట్టుకుని, చలో విజయవాడకు తరలివస్తున్న వారికి నోటీసులు జారీ చేసి, బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నారు. వారం రోజుల నుంచి సీపీఎస్ ఉద్యోగులనే లక్ష్యంగా చేసుకుని పోలీసులు భయపెడుతున్నారు. బ్రిటిష్ వారిని గుర్తుకు తెచ్చేలా విభజించి పాలించు సూత్రాన్ని ప్రభుత్వం పక్కాగా అమలు చేస్తోందని ఉద్యోగులు విమర్శిస్తున్నారు. ఉద్యోగుల సమస్యల పై ఏ నిరసన చేపట్టినా పాత పెన్షన్, సీపీఎస్ ఉద్యోగులు కలిసి పాల్గొనేవారు. ఇప్పుడు పాత పెన్షన్ ఉద్యోగులు సైతం చలో విజయవాడకు తరలిరానున్నారు. సెప్టెంబరు 1న ఉద్యోగుల తలపెట్టిన ఆందోళనకు అనుమతివ్వాలని పోలీసులకు దరఖాస్తు చేసినప్పటికీ, ఇంతవరకు వారికి ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ప్రభుత్వం అప్రజాస్వామిక చర్యలకు పాల్పడుతోందని మండిపడుతున్నారు. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఏపీసీపీఎస్‌ఈఏ ఉద్యోగ సంఘాల నేతల పైనే కేసులు నమోదు చేశారు. సీఎం ఇంటి ముట్టడికి పిలుపునిచ్చిన సంఘాల నేతలపై ఎలాంటి కేసులు పెట్టకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందని ఉద్యోగులు పేర్కొన్నారు. ఉద్యోగ సంఘాల్లోనే విభజించు, పాలించు తరహాగా ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు.

ఉపాధ్యాయుల వాహనాలు స్వాధీనం తగదు: ఎస్టీయూ

రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు సీపీఎస్ రద్దు ఉద్యమంలో పాల్గొంటారన్న నెపంతో ఉపాధ్యాయుల కార్లు, ద్విచక్ర వాహనాలను ఆయా పోలీసులు స్వాధీనం చేసుకొని, స్టేషన్లలో ఉంచడాన్ని రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయూ-ఏపీ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయి శ్రీనివాస్, హెచ్.తిమ్మన్న ఒక ప్రకటనలో ఖండించారు. సీపీఎస్ రద్దు చేస్తామని సీఎం జగన్ హామీ ఇచ్చారని, అది అధికార పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలోని అంశమని స్పష్టం చేశారు. దానిని అమలు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని మూడేళ్లుగా ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తుంటే, ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఉపాధ్యాయులను, ఉద్యోగులను నేరస్తులుగా భావించి, సెక్షన్ 149, 151 కింద నోటీసులు ఇవ్వడం అత్యంత దుర్మార్గమని విమర్శించారు. వారిని నిర్బంధించడం, ఉపాధ్యాయుల కార్లు, ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకోవడాన్ని తప్పుపట్టారు. ఇంతటి నిరంకుశ ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సీపీఎస్ పై ఒక రాజకీయ నిర్ణయం తీసుకుని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరని, భవిష్యత్తులో ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

కొత్త కార్మిక చట్టాలు రద్దు చేయాల్సిందే

(మొదటిపేజీ తరువాయి)

చట్టాలను కార్మికుల సాధికారతకు దోహదం చేస్తాయని అబద్ధం చెప్పడంలో మోదీ ఉద్దేశం ఏమిటని ఏఐటీయూసీ జాతీయ కార్యదర్శి అమర్‌జిత్ కౌర్ శనివారం ఒక ప్రకటనలో నిలదీశారు. నిరసనబాట పట్టిన కోట్లాది మంది కార్మికుల గాయాలపై కారం చల్లే పనిని ఆయన చేస్తున్నారని విమర్శించారు. బానిసత్వ చట్టాలను తమ ప్రభుత్వం తొలగించినట్లు మోదీ చెప్పుకుంటున్నారుగానీ వాస్తవానికి కొత్త కోడ్‌లతో కార్మికులకు బానిసత్వ సంకెళ్లు పడతాయని, ముఖ్యంగా అసంఘటిత, ఒప్పంద, అవుట్‌సోర్సింగ్ కార్మికులపై వీటి ప్రభావం తీవ్రంగా ఉంటుందని కౌర్ ఆవేదన వ్యక్తంచేశారు. నాలుగు లేబర్

కోడ్‌లను రద్దు చేయాలని కార్మికులు, కేంద్ర కార్మిక సంఘాలు డిమాండు చేస్తూనే ఉన్నా మోదీకి పట్టడం లేదని దుయ్యబట్టారు. కనీస వేతనాలు, ఉద్యోగ, సామాజిక, ఆరోగ్య భద్రత ఈ కోడ్‌లతో లభిస్తుందని మోదీ మభ్యపెడుతున్నారన్నారు. 'కార్మికుల్లో 90శాతం మందికిపైగా కార్మికకోడ్‌ల వల్ల ప్రాథమిక హక్కులను కోల్పోతారు. ప్రధానమంత్రి అంతా తెలిసి కూడా విస్మయం ప్రదర్శిస్తున్నారా?' అని కౌర్ ప్రశ్నించారు. 'దేశ లక్ష్యసాధన కోసం మహిళా శక్తి సద్వినియోగానికి మోదీ పిలుపునిచ్చారు. అందుకు భిన్నంగా కార్మిక కోడ్‌లను తెచ్చారు. చట్టాల పరిధిలో మహిళా కార్మికులు లేరు. దేశ కార్మికశక్తిలో పెరుగుతున్న లింగ విభేదం/వ్యత్యాసం గురించి ప్రధాని నిజాయితీగా మాట్లాడాలి. ఈ పరిస్థితి ప్రపంచ సగటు కంటే దారుణం. సంఘటిత, అసంఘటిత రంగాల్లోనూ లింగ వ్యత్యాసం తీవ్రమవుతోంది' అని అమర్‌జీత్ కౌర్ పేర్కొన్నారు. మహిళా కార్మికుల పరిస్థితిని మెరుగుపర్చేందుకు మోదీ ప్రభుత్వం తగిన విధానాలు ఏమీ లేవన్నారు. ప్రధానమంత్రి పరిభాష అసూక్ష్మతల (టెర్మినాలజికల్ ఇన్‌ఎక్స్‌యాక్టిట్యూడ్స్)ను సరిచేసే సమయం ఇది కాదని, ఆయన ముందునుంచి అదే ధోరణిని కొనసాగిస్తున్నారని కౌర్ అన్నారు.

మూడు వివాదాస్పద చట్టాలను తెచ్చి వాటి వల్ల రైతులకు సాధికారత చేకూరుతుందని చెప్పారుగానీ చరిత్రాత్మక రైతాంగ పోరాటం ఎదుట తలొగ్గి వాటిని రద్దు చేసుకున్నారు. ప్రభుత్వ నిజంగా రైతుల సాధికారతను ఉద్దేశించి వాటిని రూపొందించినట్లయితే ఆమేరకు అన్నదాతలను నచ్చజెప్పగలిగేవారు. కొత్త కార్మిక చట్టాలూ అంతే' అని కౌర్ వ్యాఖ్యానించారు. కార్మిక కోడ్‌లను రద్దు చేయాలని భారతీయ కార్మికలోకం డిమాండు చేస్తోందన్నారు. వీటి అమలు పార్లమెంటరీ విధానానికి వ్యతిరేకమని పేర్కొన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాన్ని మోదీ చేశారని, ఈ వైఖరిని ఏఐటీయూసీ తీవ్రంగా ఖండిస్తోందని అన్నారు. కేంద్ర కార్మిక సంఘాలు, సమాఖ్యలు, సంస్థలతో కలిసి లేబర్ కోడ్‌లను రద్దు చేయించే వరకు విశ్రమించేది లేదని అమర్‌జీత్ కౌర్ వెల్లడించారు.

కొత్త సీజేఐ యూయూ లలిత్ ప్రమాణం

న్యూదిల్లీ : భారత 49వ ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)గా జస్టిస్ ఉదయ్ ఉమేశ్ లలిత్ శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రపతిభవన్‌లో రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము ఆయనతో ప్రమాణం చేయించారు. బార్ నుంచి అత్యున్నత న్యాయస్థానానికి పదోన్నతి పొందిన రెండవ సీజేఐగా నిలిచారు. ఈయన పదవీకాలం 74 రోజులు మాత్రమే. ఆపై 65ఏళ్ల పడిలోకి అడుగు పెట్టే క్రమంలో నవంబరు 8న జస్టిస్ లలిత్ పదవీ విమరణ పొందుతారు. సీనియారిటీ ప్రాతిపదికన జస్టిస్ లలిత్ తర్వాత ఈ అత్యున్నత పదవికి జస్టిస్ డీవై చంద్రచూడ్ అర్హులవుతారు. 1971, జనవరిలో 13వ సీజేఐగా జస్టిస్ ఎస్ఎం సిక్రీ బాధ్యతలు చేపట్టారు. ఆయన 1964 మార్చిలో సర్వోన్నత న్యాయస్థానానికి నియమితులైన మొట్టమొదటి న్యాయమూర్తి. ఆయన తర్వాత జస్టిస్ లలిత్ అదే తరహాలో నియమితులయ్యారు. ప్రమాణ స్వీకారం అనంతరం రిజిస్టర్‌లో సంతకం చేసిన నూతన సీజేఐ యూయూ లలిత్‌కు రాష్ట్రపతి ముర్ము శుభాకాంక్షలు తెలిపారు. ప్రమాణ స్వీకారానికి ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, జస్టిస్ ఎన్వీ రమణ, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, కేంద్ర మంత్రులతో పాటు జస్టిస్ యూయూ లలిత్ కుటుంబసభ్యులు కూడా హాజరయ్యారు. ప్రమాణ స్వీకారానికి ముందు తన 90 ఏళ్ల తండ్రి పాదాలకు జస్టిస్ లలిత్ నమస్కరించారు. ఇతర కుటుంబ సభ్యుల ఆశీర్వాదం పొందారు. నూతన సీజేఐగా తన పదవీకాలంలో కేసులను సరళీకృతం చేయడం, పారదర్శకంగా, స్పష్టంగా ఉండటంపై దృష్టిపెడతానని చెప్పారు. వెంటనే విచారించాల్సిన వ్యవహారాలు త్వరితగతిన సంబంధిత బెంచీలు పరిశీలించేలాగా చూస్తానని, నిష్పాక్షింగా వ్యవహరిస్తానని సీజేఐ యూయూ లలిత్ హామీనిచ్చారు. వంద రోజుల కంటే తక్కువ పదవీకాలం పొందిన సీజేఐలలో జస్టిస్ లలిత్ ఆరవవారు.

1957, నవంబరు 9న మహారాష్ట్రలో జన్మించిన జస్టిస్ లలిత్ 1983 జూన్‌లో న్యాయవాద వృత్తిలోకి వచ్చారు. 1985 డిసెంబరు వరకు బాంబే హైకోర్టులో పనిచేశారు. 1986 జనవరిలో దిల్లీలో ప్రాక్టీస్ పెట్టారు. 2004 ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది అయ్యారు. 2జీ స్పెక్ట్రమ్ కుంభకోణం కేసు విచారణలో సీబీఐ తరపు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా వ్యవహరించారు. 2019, జనవరిలో రామజన్మభూమి, బాబ్రీ మసీదు కేసు విచారణ నుంచి తప్పుకున్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా అనేక కీలక కేసుల్లో చరిత్రాత్మక తీర్పులను జస్టిస్ లలిత్ వెలువరించారు.

ఆ మూడింటిపైనే దృష్టి....

నూతన సీజేఐగా సుప్రీంకోర్టులో తక్షణమే విచారించాల్సిన కేసులతో పాటు మూడు కీలక క్షేత్రాలపై ప్రధానంగా దృష్టిని కేంద్రీకరించనున్నట్లు జస్టిస్ యూయూ లలిత్ తెలిపారు. ఏడాది మొత్తం కనీసం ఒక రాజ్యాంగ ధర్మాసనం సర్వోన్నత న్యాయస్థానంలో పనిచేసేలా చూస్తానని చెప్పారు. జస్టిస్ ఎన్వీ రమణకు వీడ్కోలు పలికేందుకు సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ (ఎస్‌సీబీఏ) శుక్రవారం నిర్వహించిన సభలో జస్టిస్ లలిత్ మాట్లాడారు. సుప్రీంకోర్టులో లిస్టింగ్‌ను సరళీకరిస్తానని, ఆ ప్రక్రియ పారదర్శకంగా ఉండేలా చూస్తానని చెప్పారు. 'నా అభిప్రాయం ప్రకారం ఉదయం 9 గంటలకే ధర్మాసనం సిద్ధం కావాలి. ఉదయం ఏడింటికి పిల్లలు బడికి వెళుతుంటే మనమెందుకని 9 గంటలకు కోర్టుకు రాలేమని ఎవరికి వారు ప్రశ్నించుకోవాలి' అని జస్టిస్ లలిత్ ఈమధ్యన చేసిన వ్యాఖ్యలు చర్చకు తెరతీయడం విదితమే.

కమ్యూనిస్టుల పునరైక్యత అవశ్యం

మాట్లాడుతున్న ముప్పాళ్ల

విశాలాంధ్ర బ్యూరో– విశాఖపట్నం: కమ్యూనిస్టుపార్టీల పునరైక్యత అత్యంత అవశ్యమని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా ఉద్ఘాటించారు. నియంతృత్వ, పాశవిక మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించడానికి వామపక్ష, లౌకిక, ప్రజాతంత్ర శక్తులన్నీ ఏకం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఎనిమిదేళ్ల మోదీ పాలనలో దేశానికి అప్పులు తప్ప మిగిలిందేమీ లేదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ఇష్టానుసారం తన అనుంగు మిత్రులకు ఉదారంగా కట్టబెడుతున్నారని నిశితంగా విమర్శించారు. విశాఖలో జరుగుతున్న సీపీఐ రాష్ట్ర 27వ మహాసభలను పురస్కరించుకుని శనివారం ప్రతినిధుల సభను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయాలు, తాజా పరిణామాలను వివరించారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి దారితీసిన పరిస్థితులను, నాటో విస్తరణ వెనుక అమెరికా ప్రోత్సాహం, శ్రీలంకలో ఆర్థిక సంక్షోభం, ప్రజల తిరుగుబాటు వంటి అంశాలను వివరించారు. కోవిడ్ సంక్షోభాన్ని కమ్యూనిస్టుపార్టీ అధికారంలో ఉన్న క్యూబా, వియత్నాం లాంటి దేశాలు అత్యంత సమర్థవంతంగా ఎదుర్కొన్నాయన్నారు. భారత్‌లో మాత్రం ప్రధాని మోదీ కోవిడ్‌ను ఎదుర్కోవడంలో ఘోరవైఫల్యం చెందారని విమర్శించారు. అకస్మాత్తుగా లాక్‌డౌన్ విధించడంతో వలస కూలీలు తినడానికి తిండి లేక, గమ్యం చేరుకోవడానికి మార్గం లేక వేలాది కిలోమీటర్లు కాలినడకన స్వగ్రామాలకు చేరారని గుర్తు చేశారు. కరోనాతో మృతి చెందినవారి మృతదేహాలకు కనీసం దహన సంస్కారాలు చేసే పరిస్థితి లేకుండా పోయిందని, గంగా నది ఒడ్డున శవాల గుట్టలుగా పేరుకుపోయాయన్నారు. ప్రభుత్వ విమర్శకులు మోదీకి శత్రువులయ్యారని, నక్సలైట్లు, ఉగ్రవాదుల పేరుతో దారుణ హింసకు గురి చేస్తున్నారని ఆగ్రహంబ వ్యక్తంచేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్న వారిపై దేశద్రోహ ముద్ర వేసి జైళ్లకు పంపుతున్నారని, ప్రత్యేకించి కమ్యూనిస్టులను మోదీ ప్రధాన శత్రువుగా పరిగణిస్తున్నారని విమర్శించారు. బీజేపీ మత రాజకీయాలనే నమ్ముకుని రాజకీయం చేస్తున్నదని, ముస్లిం, క్రైస్తవులు, దళితులు, ఆదివాసీలు, కమ్యూనిస్టులపై దాడులకు పాల్పడుతోందన్నారు. రాజకీయ లబ్ధి కోసం మతాన్ని, కులాన్ని నిర్లజ్జగా వాడుకుంటోందన్నారు. మోదీ పాలన కార్పొరేట్లకు కాసుల పంట కురిపిస్తోందని, ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ అంబానీ, అదానీ వంటి బడా పారిశ్రామికవేత్తలకు దోచిపెడుతోందన్నారు. విమానాశ్రయాలు, నౌకాశ్రయాలను కారుచౌకగా అదానీకి కట్టబెడుతోందని, చివరకు లాభాల్లో నడిచే విశాఖ ఉక్కును సైతం ప్రైవేటీకరించేందుకు ఏమాత్రం వెనుకాడటం లేదని విమర్శించారు. ఎన్డీఏ హయాంలో పేదలు మరింత పేదలుగా, సంపన్నులు కుబేరులుగా మారుతున్నారని అన్నారు. అందుకే మానవాభివృద్ధి సూచీలో భారత్ అట్టడుగు స్థాయికి పడిపోయిందని వివరించారు. కనీస అవసరాలైన విద్య, వైద్యం, ఉపాధి, గూడు, భూమి పేదలకు దక్కడం లేదన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగ హామీని గాలికొదిలేశారని, తాజాగా అగ్నిపథ్ పేరుతో ఆరెస్సెస్, బీజేపీ వలంటీర్లకు ఉపాధి కల్పించే పనిలో పడిందని ఆయన విమర్శల వర్షం కురిపించారు. రైతుల పొట్టకొట్టటానికి మోదీ సర్కార్ మూడు సాగు చట్టాలు తీసుకొచ్చిందని, వాటికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా రైతాంగం సుదీర్ఘ ఉద్యమం చేపట్టిందని, ఈ ఉద్యమ ప్రస్థానంలో దాదాపు 700 మంది రైతులు అశువులు బాశారని తెలిపారు. అంతిమంగా రైతు ఉద్యమానికి తలొగ్గి ఆ సాగు చట్టాలను వెనక్కి తీసుకున్నారని చెప్పారు. కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలన్న అన్నదాతల డిమాండ్‌ను ఏమాత్రం పట్టించుకోవడం లేదని రాజా ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీని తీవ్రంగా ప్రతిఘటించాల్సిన కాంగ్రెస్ అంతర్గత సమస్యలతో సతమతమవుతోందని, ఇకనైనా కాంగ్రెస్ తన రాజకీయ వైఖరిని మార్చుకోవాలని ఆయన సూచించారు. 2024 ఎన్నికల్లో బీజేపీని ఓడించడమే అందరి లక్ష్యం కావాలని, ఇది రాజకీయ నినాదం కాకుండా డిమాండ్‌గా మారాలని పిలుపునిచ్చారు. మోదీ సర్కారును ఓడించడం ద్వారానే భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోగల్గుతామని స్పష్టం చేశారు. ఈ యజ్ఞంలో అందరూ భాగస్వాములు కావాలని రాజా పిలుపునిచ్చారు. ప్రతినిధుల సభకు అధ్యక్షవర్గంగా ముప్పాళ్ల నాగేశ్వరరావు, పి.హరినాథరెడ్డి, విమల, భీమారావు, అప్సర్ వ్యవహరించగా, వేదికపై సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, కార్యవర్గసభ్యులు అనీరాజా, రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సహాయకార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, కార్యదర్శివర్గ సభ్యులు రావుల వెంకయ్య, జల్లి విల్సన్, జి.ఓబులేసు, అక్కినేని వనజ, ఈశ్వరయ్య, తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ఆహ్వాన సంఘం అధ్యక్షుడు మానం ఆంజనేయులు, రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఆసీనులయ్యారు.

మోదీ విధానం దేశానికి ప్రమాదకరం

సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : ప్రధాని మోదీ అవలంబిస్తున్న నియంతృత్వ విధానాలతో దేశానికి ప్రమాదం పొంచివుందని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య అన్నారు. శనివారం విజయవాడలో మీట్ ది ప్రెస్‌లో ఆయన మాట్లాడారు. బీజేపీకి అధికారమే పరమావధి అని అన్నారు. 75 ఏళ్ల స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందని, అయితే బీజేపీ విధానాలతోనే దేశానికి తీవ్ర ఇబ్బందులు ఏర్పడతాయన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీని గద్దెదించడానికి ప్రతి ఒక్కరు ఏకతాటిపైకి రావాలన్నారు. దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాంతీయ పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఆ పార్టీ ఎమ్మెల్యేల్లో చీలిక తీసుకురావడం, ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి ఆ రాష్ట్రాలను హస్తగతం చేసుకుంటోందని విమర్శించారు. బీహార్ లో ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ప్రాంతీయ పార్టీలను ఏకం చేసి బీజేపీకి చుక్కలు చూపించారని దాంతో అక్కడ ప్రభుత్వాన్ని దెబ్బ తీయడానికి బీజేపీ కుటిల ప్రయత్నాలు మెదలు పెట్టిందన్నారు. ప్రాంతీయ పార్టీలు ఏకతాటిపైకి వచ్చినట్లయితే బీజేపీని తుదముట్టించవచ్చున్నారు. బిల్కిస్ బానో నిందితులను విడుదల చేయడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే నన్నారు. దేశాన్ని అదానీ, అంబానీలకు దోచిపెడుతున్నారని విమర్శించారు. భారత రైల్వేతో సహా అన్ని ప్రభుత్వరంగ సంస్థలను మోదీ ప్రైవేటుపరం చేస్తూ దుర్మార్గ చర్యలకు పాల్పడుతున్నారన్నారు. దేశంలోని క్రిస్టియన్, మైనారిటీలు, ముస్లింలను ద్వితీయ శ్రేణి పౌరులుగా పరిగణిం చాలని బీజేపీ కుట్రపన్నుతోందనీ, భారత రాజ్యాంగాన్ని, లౌకికవాదాన్ని దెబ్బతీసే చర్యలకు పాల్పడుతోందని మండిపడ్డారు. సైన్యంలో అగ్నిపథ్ కాంట్రాక్ట్ సర్వీస్ అనేది ఒక భారీ కుంభకోణమన్నారు. రానున్న 2024 ఎన్నికల్లో బీజేపీని గద్దె దించాలని విజ్ఞప్తి చేశారు. ఐజేయూ ఉపాధ్యక్షుడు అంబటి ఆంజనేయులు దీపాంకర్‌ను శాలువతో సత్కరించగా, సీనియర్ జర్నలిస్టు ఎస్‌కె బాబు మెమెంటో అందజేశారు. ఏపీయూడబ్ల్యూజే ఉపాధ్యక్షుడు కే జయరాజ్, ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు నిమ్మరాజు చలపతిరావు, ఆర్ వసంత్ పాల్గొన్నారు.

సాగర్‌కు మళ్లీ వరద

విశాలాంధ్ర- విజయపురిసౌత్ : ఎగువ నుంచి సాగర్‌కు మళ్లీ వరద వస్తుండటంతో నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ 10 క్రస్ట్ గేట్ల ద్వారా శనివారం నీటిని విడుదల చేశారు. సాగర్ జలాశయానికి 1,13,094 క్యూసెక్కుల వరద నీరు శ్రీశైలం నుంచి ఇన్ ఫ్లోగా వస్తోంది. ప్రాజెక్ట్ నీటిమట్టం 590.00 అడుగులకు చేరువైంది. ఇది 312.0450 టీఎంసీలకు సమానం. సాగర్ నుంచి కుడి కాల్వకు 9500 క్యూసెక్కుల నీరు, ఎడమ కాలువకు 4949 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ కేంద్రానికి 32,845 క్యూసెక్కుల నీరు, ఎస్‌ఎల్బీసీకి 2400 క్యూసెక్కులు, వరద కాలువకు 400 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. సాగర్ ప్రాజెక్టు 10 క్రస్ట్ గేట్లు 5 అడుగులు మేర ఎత్తి 81,వేల క్యూసెక్కుల వరద నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి టోటల్ అవుట్ ఫ్లోగా 1,13,094 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 884.80 అడుగులుగా ఉంది. ఇది 214.3439 టీఎంసీల సమానం. శ్రీశైలం జలాశయానికి జూరాల నుంచి 1,60,429 క్యూసెక్కుల నీరు ఇన్ ఫ్లోగా వస్తోంది.

బిల్కిస్ బానో కేసులో దోషులను తిరిగి జైలుకు పంపాలి

భారత జాతీయ మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి అనీ రాజా

సిరిపురం కూడలి వద్ద మహిళల ప్రదర్శన.

విశాలాంధ్ర-విశాఖ: పెద్దమనుషుల్లా జైలు నుంచి విడుదలయిన బిల్కిస్ బానో అత్యాచారం కేసులో దోషులను తిరిగి జైలుకు పంపాలని, బాధిత కుటుంబాలకు తగిన న్యాయం చేయాలని భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) జాతీయ ప్రధాన కార్యదర్శి అనీ రాజా, ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మెత్స దుర్గాభవాని డిమాండ్ చేశారు. శనివారం మహిళా సంఘాల అధ్వర్యంలో దిల్లీలో జంతర్ మంతర్ వద్ద నిరసన కార్యక్రమం జరుగుతున్న నేపథ్యంలో స్థానిక సిరిపురం కూడలి వద్ద మహిళలు ప్రదర్శన, మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా అనీ రాజా, దుర్గాభవాని మాట్లాడుతూ గుజరాత్‌లో 2002 నాటి మారణకాండలో ఐదు నెలల గర్భిణి బిల్కిస్ బానో అనే యువతి పై సామూహిక అత్యాచారానికి ఒడిగట్టారని అన్నారు. అంతేకాకుండా ఆమె 3 సంవత్సరాల పసిబిడ్డను బండరాయికి మోది చంపారని, బిల్కిస్ బానో తల్లి, సోదరి, వదినలతో పాటు మరో 10 మందిని నరికి చంపేసారని, సుదీర్ఘకాలం తర్వాత జీవిత ఖైదు పడిన నిందితులను గుజరాత్ ప్రభుత్వం ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవాన క్షమాభిక్ష పెట్టి వదిలేశారని విమర్శించారు. వాస్తవానికి అత్యాచార దోషులకు క్షమాభిక్ష ఇవ్వరాదని కేంద్ర ప్రభుత్వం గతంలోనే ఆదేశాలు ఇచ్చిందని గుర్తు చేశారు. నారీ శక్తి గురించి ప్రధాని మోదీ ఉపన్యాసాలు దంచిన ఆగస్టు 15 నాడే గుజరాత్‌లోని బీజేపీ ప్రభుత్వం ఆ కేసులో దోషులను విడుదల చేసిందని ధ్వజమెత్తారు. ఆ మానవ మృగాలకు తిలకాలు దిద్ది, దండలు వెయ్యడం కూడా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో దేశ వ్యాపితంగా మేధావి వర్గం నుంచి సైతం విమర్శలు వస్తున్నాయని, తక్షణమే ఆ దోషులను తిరిగి జైలుకు పంపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్ర మంలో ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు వి. జయలక్ష్మి, వర్కింగ్ ప్రెసిడెంట్ అత్తిలి విమల, నాయకులు అక్కినేని వనజ, కె.రజని, పంచదార్ల దుర్గాంబ, పద్మావతి, పి.రాణి, భాగ్య, బషీర్, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

సీఎం దృష్టికి ఉద్యోగుల ఆవేదన

కలెక్టర్ల ద్వారా వినతులు

ఆర్టీసీ ఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామోదరరావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆర్టీసీ ఉద్యోగుల ఆవేదనను సీఎం దృష్టికి తీసుకెళ్లేందుకు సంతకాల సేకరణ చేపట్టామని ఆర్టీసీ ఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదరరావు పునరుద్ఘాటించారు. విజయవాడ దాసరిభవన్‌లో శనివారం ఎన్టీఆర్‌జిల్లా ఏపీ పీటీడీ-ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా నిర్మాణ మహాసభ జరిగింది. ఈయూ నాయకులు ఎన్‌హెచ్.ఎన్.చక్రవర్తి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన పలిశెట్టి మాట్లాడుతూ, నాడు ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలోకి సీఎం విలీనం చేయడంతో ఎంతో సంతోషించా మన్నారు. ఈ విలీనంతో ప్రభుత్వ ఉద్యోగుల తరహాగా పెన్షన్, ఇతరత్రా సౌకర్యాలు, ప్రయోజనాలు లభిస్తాయని ఆశించామని, అందుకు భిన్నంగా సంక్షేమ పథకాలు, సౌకర్యాలు, ఇన్సెంటివ్ మొదలైనవి తొలగిస్తూ, ఆర్టీసీ యాజమాన్యం ఏకపక్షంగా నిర్ణయించిందని చెప్పారు. దీనిపై అధికారులను ఉద్యోగ సంఘాల నేతలు ప్రశ్నిస్తే, అవన్నీ ప్రభుత్వ ఆదేశాల మేరకే చేస్తున్నామంటూ దాటవేత ధోరణితో ఉన్నారన్నారు. యాజమాన్యం ఏకపక్ష నిర్ణయాలతో నిత్యం ఉద్యోగుల్లో అసంతృప్తులు పెరిగి, వారంతా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్నారని, ఈ నేపథ్యంలో ఆర్టీసీ ఉద్యోగుల ఆవేదనను సీఎం జగన్‌కు తెలిపేందుకు నిర్ణయించామని వివరించారు. 26 జిల్లాల కలెక్టర్ల ద్వారా సీఎంకు వినతులు పంపే ప్రక్రియ ఈనెల 28తో పూర్తవుతుందన్నారు. ఈయూ రాష్ట్ర కార్యదర్శులు ఎండీ ప్రసాద్, టీవీ భవానీ, ఉపాధ్యక్షుడు మందపాటి శంకరరావు, ఏ రామచందరరావు, విజయవాడ జోనల్ కార్యదర్శి ఎస్కే సుభాని, వివిధ జిల్లాల యూనియన్ నేతలు పాల్గొన్నారు.

సీపీఎస్‌కు సరైన ప్రత్యామ్నాయం తెస్తాం

విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ

విశాలాంధ్ర-విజయనగరం: వైసీపీ ప్రభుత్వం ఉద్యోగులకు అనుకూలమని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ఉద్యో గులు కూడా ప్రభుత్వంలో ఒక భాగమేనని చెప్పారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే చిత్తశుద్ధి ప్రభుత్వానికి ఉందని తెలిపారు. ఉద్యోగ సంఘాలతో చర్చించి అన్ని సమస్యలపై తగిన నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని హామీ ఇచ్చారు. శనివారం ఇక్కడ జెడ్పీ సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తాము ప్రజలకు ఇచ్చిన హామీల్లో 95 శాతం ఇప్పటికే నెరవేర్చామని, మరో 5 శాతం మిగిలి ఉన్నాయన్నారు. ఇప్పటివరకు నెరవేర్చని హామీల్లో సీపీఎస్ రద్దు అంశం కూడా ఒకటని చెప్పారు. సీపీఎస్‌ను రద్దు చేస్తామని ఎన్నికల ముందు, ఎన్నికల తరువాత కూడా చెప్పిన మాట వాస్తవమేనని, ఆ మాటకు ఇప్పటికీ కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి జగన్ కూడా దీనిపై ఆలోచిస్తున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధి, దీర్ఘకాలిక ప్రయోజనాలు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ఆలోచన చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుత సీపీఎస్ వల్ల ఉద్యోగులకు ఇబ్బందులు ఉన్నాయనడంలో వాస్తవం ఉందని, దీనికి దీటైన ప్రత్యామ్నాయాన్ని తీసుకువస్తామని స్పష్టం చేశారు. ఉద్యోగుల మిలియన్ మార్చ్ గురించి తనకు తెలియదని పేర్కొన్నారు. గతంలో ఎవరిపై కేసులు ఉన్నాయో, వారికి నోటీసులు ఇవ్వడం సహజమని చెప్పారు. ముఖ్యమంత్రి ఇంటిని ముట్టడి చేస్తామని ప్రకటించడంతో చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలి

- ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలి
- సీపీఐ రాష్ట్ర మహాసభ డిమాండ్
- తొలిరోజు 4 తీర్మానాలు ఆమోదం

చలసాని వెంకట రామారావు



జంగాల అజయ్‌కుమార్

సంగిరెడ్డి హనుమంతరెడ్డి

గాలి చంద్ర

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: ఎందరో ప్రాణ త్యాగాలతో సాధించు కున్న విశాఖ ఉక్కును ప్రైవేటీకరిం చాలన్న కేంద్రంలోని మోదీ ప్రభుత్వ నిర్ణయాన్ని సీపీఐ రాష్ట్ర మహాసభ తీవ్రంగా వ్యతిరేకించింది. ఈమేరకు శనివారం ప్రతినిధుల సభలో ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని వెంకట రామారావు తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. దీంతో పాటు ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు జంగాల అజయ్‌కుమార్, పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరుతూ ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ అధ్యక్షుడు సంగిరెడ్డి హనుమంతరెడ్డి, వ్యవసాయ పంపుసెట్లకు మీటర్ల బిగింపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సీపీఐ కడప జిల్లా కార్యదర్శి గాలి చంద్ర తీర్మానాలు ప్రవేశపెట్టగా మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ... విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు అంటూ సుదీర్ఘకాలం పోరాటం కొనసాగించటమే గాకుండా, 32 మంది బలి దానాలు చేశారని చెప్పారు. విశాఖ ఉక్కుకు అవసరమైన గనులను కేంద్రం కేటాయించకుండా కేంద్రం నష్టాల పేరుతో అమ్మకానికి పెట్టిందని విమర్శించారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఎంతమాత్రం అంగీకరించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రత్యేక హోదా తీర్మానంపై అజయ్‌కుమార్ మాట్లాడుతూ ... ప్రత్యేక హోదా, కడపలో ఉక్కు ఫ్యాక్టరీ, విశాఖ రైల్వేజోన్‌తోపాటు, అమరావతి రాజధానికి ప్రత్యేక నిధులు ఇస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన నరేంద్ర మోదీ...దీనిని పూర్తిగా విస్మరించారని, ఆంధ్రప్రదేశ్‌కు తీరని ద్రోహం చేశారని విమర్శించారు. రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న అన్ని అంశాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పర్యావరణ పరిరక్షణపై హనుమంతరెడ్డి సవివరంగా మాట్లాడారు. రైతుల మెడకు ఉరి బిగించే విద్యుత్ మీటర్ల బిగింపు నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని గాలి చంద్ర డిమాండ్ చేశారు.

టీడీపీ సోషల్ మీడియా కార్యకర్త వెంగళరావు విడుదల

విశాలాంధ్ర-గుంటూరు : సీఎం జగన్, ప్రభుత్వానికి వ్యతిరేకంగా కథనాలు ప్రచారం చేశారని ఆరోపిస్తూ అరెస్టు చేసిన టీడీపీ సోషల్ మీడియా కార్యకర్త బొబ్బూరి వెంగళరావుకు రిమాండ్ విధించడం వీలుపడదని, అతడిని తక్షణమే విడుదల చేయాలని గుంటూరు సీబీసీఐడీ కేసుల ప్రత్యేక న్యాయమూర్తి కె.శ్రుతావింద శనివారం ఆదేశించారు. ఈ నెల 25న తాడేపల్లికి చెందిన గాండ్లపర్తి భరత్‌కుమార్‌రెడ్డి అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెంగళరావుపై అనేక కేసులు నమోదు చేశారు. గురువారం అర్ధరాత్రి సీఐడీ అధికారులు అదుపులోకి తీసుకొని శుక్రవారం అర్ధరాత్రి జడ్జి ఎదుట హాజరుపరచగా తనను కొట్టారంటూ వెంగళరావు ఆరోపణలు చేసిన నేపథ్యంలో పరీక్షలు నిమిత్తం అతడిని జీజీహెచ్‌కు తరలించిన విషయం విదితమే. అయితే శనివారం మధ్యాహ్నం 12:30 గంటలకు మరోసారి న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. తనకు ఆసుపత్రిలో ఎటువంటి పరీక్షలు చేయలేదని, చికిత్స చేయలేదనీ, ఆర్థోపెడిక్స్ జూనియర్ వైద్యాధికారి వద్ద పోలీసులు ఏదో చెప్పడంతో, తనను అక్కడి నుంచి పంపించి వేశారని తెలిపారు. రాత్రంతా నిద్ర పోనివ్వకుండా వంద కేసులు పెడతామని హెచ్చరిస్తూ బెదిరించారని వెంగళరావు ఆరోపించారు. అనంతరం చట్ట ప్రకారం వెంగళరావుకు ఎటువంటి రిమాండ్ విధించే అవకాశం లేదని విజయవాడకు చెందిన సీనియర్ న్యాయవాది చుక్కపల్లి భానుప్రసాద్‌తో పాటు, గుంటూరు న్యాయవాదులు కావూరి గోపీనాథ్, సరిపూడి నాగేశ్వరరావు, శ్రీరామ్ రాజీవ్ ఆనంద్ పలు తీర్పులను ప్రస్తావిస్తూ వాదనలు వినిపించారు. పరిశీలించిన న్యాయమూర్తి శ్రుతావింద ఈ కేసులో రిమాండ్ విధించే అవకాశం లేదని, వెంగళరావును విడుదల చేయాలని, పోలీసులు కోరిన పక్షంలో వారి ఎదుట వెంగళరావు హాజరుకావాలని తీర్పు చెబుతూ విడుదలకు ఆదేశించారు.

చంద్రబాబు ఫోన్: విడుదలైన వెంగళరావును మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఫోన్ చేసి పరామర్శించారు. ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందని, చట్టాలు బాగా పనిచేస్తున్నాయని, న్యాయం తప్పక గెలుస్తుందని వెంగళరావు పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ఉద్యోగులు బానిసలుగా ఉండరాదని, ప్రభుత్వాలు మారినప్పటికీ వారు ఉద్యోగులుగా కొనసాగాల్సి ఉంటుందని గుర్తుచేశారు. మాజీ మంత్రి నక్కా ఆనందబాబు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిట్టాబత్తిన చిట్టిబాబు, నాయకులు కనపర్తి శ్రీనివాసరావు, రావిపాటి సాయికృష్ణ, పిల్లి మాణిక్యం, వేములకొండ శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ దామా మహేష్ తదితరులు వెంగళరావుకు బాసటగా నిలిచారు.

న్యాయవాదుల భద్రతా చట్టంపై దృష్టి సారించాలి: సంకు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : న్యాయవాదులకు ప్రత్యేక భద్రతా చట్టం అమలుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే దృష్టి సారించాలని ఆంధ్ర లాయర్స్ అసోసియేషన్ (ఏఎల్ఏ) రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఎస్ఆర్ సంకు అన్నారు. ఏఎల్ఏ అధ్వర్యంలో గుంటూరులోని ఓ హోటల్‌లో న్యాయవాదులు, వివిధ రంగాల మేధావులు, ప్రముఖులతో శనివారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్ఆర్ సంకు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలతో పాటు దేశ వ్యాప్తంగా న్యాయవాదులపై దాడులు పెరిగాయని, వృత్తిపరంగా రక్షణ లేకపోతే న్యాయ వ్యవస్థ స్వేచ్ఛగా పని చేయలేదన్నారు. న్యాయవాదుల ద్వారా కోర్టు ఫీజుల రూపంలో రాష్ట్ర ప్రభుత్వానికి తగిన ఆదాయం వస్తున్నా, వారిపై అధికంగా ప్రొఫెషనల్ టాక్స్ విధించడం అమానవీయమన్నారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మేడా శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నుకోబడిన రాజకీయ నాయకులు పాలకులుగా రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమైన పాలన చేస్తున్నప్పుడు..వారిని అదుపు చేయాల్సిన రాజ్యాంగ వ్యవస్థలు విఫలమవుతున్నప్పుడు, రాజ్యాంగ లక్ష్యాల పరిరక్షణకు రాజ్యాంగ బద్ధంగా చేయాల్సిన మార్పులను ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. న్యాయవాదులకు భారంగా మారిన వృత్తి(ప్రొఫెషనల్) టాక్స్‌పై ప్రభుత్వం పునరాలోచించాలని విజ్ఞప్తి చేశారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎంవీ రాజారామ్ గుంటూరు కేంద్రంగా కాన్‌స్టిట్యూషన్ క్లబ్ త్వరలో ఏర్పాటు చేయాలనే ఆంధ్ర లాయర్స్ అసోసియేషన్ తీర్మానాన్ని ప్రకటించారు. ఈ క్లబ్ విధి విధానాలు ప్రారంభోత్సవ కార్యక్రమం త్వరలో ప్రకటిస్తామని వెల్లడించారు. సీనియర్ న్యాయవాది భావిరెడ్డి హరనాథ్‌బాబు, అసోసియేషన్ ఉపాధ్యక్షులు నడింపల్లి గురుదత్, కార్యదర్శి అవధానుల హరి, కార్యనిర్వాహక కార్యదర్శి మంగళంపూరి శ్రీనివాస్, అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు డాక్టర్ టి.సేవకుమార్, వ్యవసాయ ఆర్థిక శాస్త్రవేత్త జొన్నలగడ్డ రామారావు, ఆంధ్ర మేధావుల సంఘం కార్యదర్శి పన్నాల సత్యనారాయణ మూర్తి, కాన్‌స్టిట్యూషన్ క్లబ్ ఏర్పాటును స్వాగతించారు.

రాహుల్‌పై ఆజాద్ విమర్శలు అర్థరహితం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కాంగ్రెస్ పార్టీకి సీనియర్ నేత గులాం నబీ ఆజాద్ రాజీనామా చేసి, రాహుల్‌పై విమర్శలు చేయడం అర్థరహితమని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే శైలజానాథ్ శనివారం ఓ ప్రకటనలో మండిపడ్డారు. రాహుల్‌పై ఇలాంటి విమర్శలు చేయడం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. పార్టీలో మాస్ లీడర్ రాహుల్ అని, కాంగ్రెస్ పార్టీని ఎవరూ ఏమీ చేయలేరని, అయన పార్టీకి రాజీనామా చేసినంతమాత్రాన వచ్చే నష్టం ఏమీ లేదని స్పష్టం చేశారు. ఇన్నాళ్లు పార్టీలో ఉన్నతమైన పదవులను అనుభవించిన ఆజాద్ కాంగ్రెస్ నేతలపై విమర్శలు చేయకుండా గౌరవంగా పార్టీని వీడి ఉంటే బాగుండేదని హితవు పలికారు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వంటి కీలక అంశాలపై కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి వ్యతిరేకంగా పోరాడుతున్న సమయంలో ఆయన రాజీనామా చేయడం విచారకరమన్నారు. దేశాన్ని 50 ఏళ్లు పాలించిన ఎంతోమంది నేతలు పార్టీని వీడినా కొత్త నేతలు తయారవు తారన్నారు. కాంగ్రెస్ నాయకత్వం ఆయనను ఎంతో గౌరవించిందని, అతడు మాత్రం ద్రోహం చేశారని మండిపడ్డారు. 2013లో రాహుల్ ఉపాధ్యక్ష బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి పార్టీ నాశనమైందని ఆరోపించడం భావ్యం కాదన్నారు. రాహుల్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం తథ్యమని స్పష్టంచేశారు. రాహుల్ చేపట్టనున్న భారత్ జోడో యాత్రతో బీజేపీ బెదిరిపోతోందన్నారు.

తుపాకీ పట్టిన చేతితోనే కలం ఝుళిపించిన డా. రాజ్ బహదూర్ గౌర్

(మొదటిపేజీ తరువాయి)

ఉపసంహరించడంతో యువతరం నిరాశకు లోనైంది. చాలా మంది యువకులు వామపక్ష భావజాలం వేపు మొగ్గారు. రాజ్ బహదూర్ కూడా వామపక్షం వేపు మొగ్గారు. 1939 నాటికే రాజ్ బహదూర్ కమ్యూనిస్టు అవతారం ఎత్తారు. అప్పటికి తెలంగాణలో కమ్యూనిస్టు పార్టీ లేదు. ఆ సమయంలో మఖ్దుం మొహియుద్దీన్, రాజ్ బహదూర్, ఆలం కుందుమిరి, జవాద్ రజ్వీ, చంద్రగుప్త చౌదరి లాంటి వారు కామ్రేడ్స్ అసోసియేషన్ నడిపారు. ప్రసిద్ధ కవి మఖ్దుం మొహియుద్దీన్ లాంటి వారికి కమ్యూనిస్టులతో సంబంధాలు ఉండేవి. కామ్రేడ్స్ అసోసియేషన్ కమ్యూనిస్టు పార్టీలో కలిసి పోయింది. ఆ రకంగా హైదరాబాద్ సంస్థానంలో కమ్యూనిస్టు పార్టీ వ్యవస్థాపకుల్లో రాజ్ బహదూర్ కూడా ఒకరయ్యారు.

1938లో వందేమాతరం ఉద్యమంలో రాజ్ చురుకుగా పాల్గొన్నారు. వందేమాతరం ఆలపించడాన్ని ప్రభుత్వం నిషేధించింది. అయినా ఆ ఆంక్షలను ఉల్లఘించి వందేమాతరం ఆలపించేవారు. రాజకీయాల విషయానికి వస్తే జవహర్ లాల్ నెహ్రూను, సరోజినీ నాయుడును రాజ్ అభిమానించే వారు. గాంధీకి మతానురక్తి ఉండడం వల్ల రాజ్ బహదూర్‌ను ఆకర్షించలేదు. 1939లో అంటే 21వ ఏట రాజ్ బహదూర్ కమ్యూనిస్టు పార్టీలో చేరారు. 1940లో హైదరాబాద్ లో పార్టీ శాఖ ఏర్పడింది. మఖ్దూం కార్యదర్శిగా రాజ్ బహదూర్ సహాయ కార్యదర్శిగా ఉండే వారు. ఆంధ్ర కమ్యూనిస్టు పార్టీ నిర్వహణలోని ప్రాంతీయ కమిటీలో కూడా రాజ్ బహదూర్ పని చేసే వారు.

1946లో నల్లగొండ, వరంగల్ జిల్లాలో సాయుధ ప్రతిఘటన మొదలైంది. అధికారికంగా కమ్యూనిస్టు పార్టీ సాయుధ పోరాటానికి పిలుపు ఇచ్చింది మాత్రం 1947 సెప్టెంబర్ 11న. 1946లో నవంబర్ లో మఖ్దూం మొదలైన వారితో పాటు రాజ్ అరెస్టయ్యారు. 1947 మే 7వ తేదీన జైలు నుంచి ఆసుపత్రికి తీసుకొచ్చినప్పుడు జవాద్ రజ్వీతో పాటు రాజ్ బహదూర్ గౌర్ తప్పించుకున్నారు. హైదరాబాద్‌లోనే అజ్ఞాతంగా ఉండిపోయారు. 1951 ఏప్రిల్‌లో మళ్లీ రాజ్‌ను అరెస్టు చేశారు. 1952 ఎన్నికల నాటికి సాయుధ పోరాటం అంతమైంది. జైళ్లలో ఉన్న కమ్యూనిస్టు నాయకులు విడుదలయ్యారు. మొదటి సార్వత్రిక ఎన్నికలలో పోటీ కూడా చేశారు. రాజ్ మాత్రం విడుదల కాలేదు. కానీ జైలు నుంచే నామినేషన్ దాఖలు చేశారు. కాని ఆయన పేరు ఓటర్ల జాబితాలో లేనందువల్ల నామినేషన్ తిరస్కరించారు.

1947లో రాజ్ బహదూర్ గౌర్ ట్రై కలర్ షల్ ఫ్లై ఓవర్ హైదరాబాద్ గ్రంథం ఇంగ్లీషులో రాశారు. ఇదే ఆయన ప్రచురించిన మొదటి గ్రంథం. అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం తో ఆయనకు 1955 నుంచి సంబంధం ఉండేది. అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్ష వర్గ సభ్యులుగా ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ అంజుమన్-ఎ-తరక్కీ ఉర్దూ (అభ్యుదయ రచయితల సంఘం) కు చాలా కాలం అధ్యక్షులుగా ఉన్నారు. సాహిత్య ప్రయోజనంపై డా. గౌర్ కు నిర్దిష్ట అభిప్రాయాలున్నాయి. ఆనందం కలిగించడం మాత్రమే సాహిత్య ప్రయోజనం కాదని అది అలసిన గుండెల సేద తీరుస్తుందని నమ్మే వారు. శ్రామికులకు కూడా సాహిత్యం అవసరామేనని వారు.

1975లో మఖ్దూం కవిత్వాన్ని విశ్లేషిస్తూ ఒక గ్రంథం వెలువరించారు. రాజ్ బహదూర్ ఇంగ్లీషు, ఉర్దూ భాషల్లో అసంఖ్యాకమైన వ్యాసాలు రాశారు. హైదరాబాద్ కమ్యూనిస్టు సమితి కార్యకలాపాలకు డబ్బు అవసరమైనప్పుడల్ల హైదరాబాద్ నగర కమిటీ ఆఫీసు కార్యదర్శి యూసుఫ్ వెళ్లి ఒక వ్యాసం రాయించుకుని అచ్చు వేయించి వచ్చే వందో రెండువందలతో పార్టీ కార్యకలాపాలు నిర్వహించే వారు. నిజాం ఏలుబడిలో తెలుగు కోసం పోరాడిన రాజ్ బహదూర్ ఆ తర్వాత ఉర్దూ అస్తిత్వం కోసం పాటు పడ్డారు.

రాజ్ బహదూర్ మంచి హాస్య చతురుడు. మాటకు మాట తిప్పి కొట్టడంలో దిట్ట. ఒక సారి మఖ్దూం నిరాహార దీక్ష చేయాల్సి వచ్చింది. మఖ్దూం ఆరోగ్యం క్షీణిస్తున్నా అప్పటి కాసు బ్రహ్మానంద రెడ్డి ప్రభుత్వం పట్టించుకోలేదు. చివరకు కమ్యూనిస్టు పార్టీ ప్రతినిధి వర్గం ముఖ్యమంత్రి బ్రహ్మానంద రెడ్డిని కలుసుకునే అవకాశం వచ్చింది. బ్రహ్మానంద రెడ్డి ఆగ్రహంతో ఉన్నందువల్ల ఈ ప్రతినిధి వర్గం రాకను గుర్తించనట్టే ఫైళ్ల మీద సంతకాలు చేస్తూ ఉండిపోయారు. ఆ నిశ్శబ్దాన్ని ఛేదించడానికి రాజ్ బహదూర్ "మా ఇంటిదగ్గర ఆనందం అని ఒకడుంటాడు. చిన్న కష్టం వస్తే కుంగి పోతాడు. సంతోషం కలిగితే అంతెత్తు ఎగిరి గంతులేస్తాడు. మీ పేరు బ్రహ్మానంద రెడ్డి అయితే మరెంత ఆనాదంగా ఉండాలి? ఇలా మొహం ముడుచుకు కూర్చున్నారే" అన్నారు. రాజ్ హాస్యచతురతకు బ్రహ్మానంద రెడ్డి విరగబడి నవ్వడంతో వాతావరణం చల్లబడింది. ఒక సారి ఎవరో మీరు నాస్తికులా అని అడిగితే "నేను నాస్తికుడినే. భగవంతుడి మీద ప్రమాణం చేసి నాస్తికుడినని చెప్తున్నాను"అని దిమ్మ తిరిగే వెటకారంతో సమాధానం చెప్పారు.

రాజ్ బహదూర్ చిక్కడపల్లి లో ఓ మురికి వాడ లాంటి చోట ఓ చిన్న ఇంట్లో ఉండే వారు. ఆ ఇంటికి చమేలీకె మండ్వా పేరు పెట్టారు. చమేలీకే మండ్వా మఖ్దూం ప్రసిద్ధ కవిత. సినిమా పాటగా కూడా ప్రసిద్ధమైంది. భోగలాలసత, ఆడంబరాలు రాజ్ బహదూర్ జీవితంలో ఎన్నడూ దరిజేరలేదు. ఎక్కడికెళ్లినా తన బట్టలు తానే ఉతుక్కునే వారు. ఒక సారి దిల్లీలోని కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కార్యాలయం అజయ్ భవన్ లో ఉన్నారు. అప్పుడు విద్యార్థి యువజన నాయకుడిగా ఉన్న సురవరం సుధాకర రెడ్డి (ప్రస్తుతం సి.పి.ఐ. మాజీ ప్రధాన కార్యదర్శి) ఎక్కడికో పర్యటనకెళ్లి పదిహేను రోజుల తర్వాత తిరిగి వచ్చారు. సుధాకర రెడ్డి బట్టలు, దుప్పట్లు, దిండు గలేబులు రాజ్ బహదూర్ శుభ్రంగా ఉతికి పెట్టారు. ఇదేమిటి అని అడిగితే నువ్వు ఇంతకన్నా బాగా ఉతుకుతావా, పైగా సాయుధ పోరాటంలో నా సహచరుడి (సురవరం నారాయణ్ రెడ్డి. సుధాకర్ రెడ్డి తండ్రి. సాయుధ పోరాటంలో భాగస్వామి) కొడుకు బాగోగులు చూడడం నా విధి అన్నారు డా. గౌర్.

రాజ్ బహదూర్ మరణానికి కొన్ని రోజుల ముందే పార్లమెంటు సభ్యులకు రావాల్సిన పింఛన్ బకాయిలు అందాయి. అందులోంచి మూడు లక్షల రూపాయలు ఉర్దూ అభ్యసించే విద్యార్థులకు ఉపకార వేతనాల కోసం ఉర్దూ తాలిమీ ట్రస్ట్ కు విరాళంగా ఇచ్చారు. బ్యాంకు ఖాతాలో ఉన్న డబ్బు కమ్యూనిస్టు పార్టీకి చెందాలని వీలునామా రాశారు. తన మరణం తర్వాత ఎలాంటి కర్మ నిర్వహించకూడదని కూడా అందులో రాశారు. ఆయన భౌతికకాయాన్ని ఉస్మానియా వైద్య కళాశాలకు అప్పగించారు.

90 ఏళ్లు వచ్చిన తర్వాత కూడా ఎవరైనా ఆయన ఇంటికి వెళ్తే మాట మంతీ ముగిసిన తర్వాత సాగనంపడానికి గేటు దాకా వచ్చే వారు. మీరు రావడం ఎందుకు ఉండండి అంటే "అతిథి మర్యాద చేయడం నా బాధ్యత" అనే వారు. దక్కనీ తహజీబ్ అంటే అదే. తుపాకి పట్టిన చేతితోనే కలం ఝుళిపించిన సాహితీ రంగ యోధుడు డా. రాజ్ బహదూర్ గౌర్.

కాంగ్రెస్ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించేలా

రాహుల్ని బలవంతపెడతాం : ఖర్గే



బెంగళూరు : కాంగ్రెస్ అధ్యక్ష బాధ్యతలను తిరిగి స్వీకరించాలంటూ రాహుల్ గాంధీని బలవంత పెడతామని ఆ పార్టీ సీనియర్ నేత మల్లికార్జున ఖర్గే శనివారం తెలిపారు. ఆయన తప్ప ఆ పదవికి అర్హులైన నాయకుడు లేరన్నారు. పార్టీకి నాయకత్వం వహించాలంటే దేశంలో గుర్తింపు, ఆదరణ ఉండాలని చెప్పారు. కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు పశ్చిమ బెంగాల్ నుంచి గుజరాత్ వరకు మద్దతు పొందగలగాలని అన్నారు. మొత్తం కాంగ్రెస్ పార్టీ ఆదరించే వ్యక్తి మాత్రమే అధ్యక్షుడిగా అర్హుడని, ఆ అర్హతలన్నీ ఉన్న వారు రాహుల్ గాంధీ ఒక్కరే అని ఖర్గే అభిప్రాయపడ్డారు. సీనియర్లంతా పార్టీలోకి తిరిగి రావాలని, పనిచేయాలని సోనియాగాంధీని బలవంత పెట్టారని, క్షేత్రస్థాయిలో పోరాడాలని రాహుల్ గాంధీని కోరారని చెప్పారు. రాహుల్‌కు ప్రత్యామ్నాయం ఎవరో చెప్పండి అని పీటీఐతో మాట్లాడిన ఖర్గే ప్రశ్నించారు. భారత్ జోడో యాత్రను ప్రస్తావిస్తూ 'జోడో భారత్' (భారత్‌ను ఏకం చేయడం) కోసం రాహుల్ గాంధీ అవసరమని ఆయనన్నారు. 'మేమంతా కలిసి అడుగుతాం. అవసరమైతే బతిమిలాడుతాం... బలవంత పెడతాం. ఆయన వెన్నంటే ఉంటాం... అధ్యక్ష బాధ్యతలు స్వీకరించమని కోరతాం' అని ఖర్గే అన్నారు. కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికల తేదీలను ఖరారు చేసేందుకుగాను ఆదివారం జరగబోయే కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశానికి సోనియాగాంధీ అధ్యక్షత వహిస్తారు. అనేకమంది సీనియర్లు హాజరవుతారు. రాహుల్ తిరిగి పార్టీ అధ్యక్షుడు కావాలని అనేకమంది నేతలు కోరుతుండగా ఆయన విముఖంగా ఉండటంతో ఈ ఉత్కంఠ కొనసాగుతోంది.

గుజరాత్‌లో మత ఘర్షణ...

భారీగా భద్రత

భుజ్: గుజరాత్, కచ్ జిల్లాలోని మాదాపూర్ గ్రామంలో మత ఘర్షణకు దారితీసిన హత్య కేసులో పోలీసులు నిందితుడిని పట్టుకున్నారని, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ భద్రత ఏర్పాట్లు చేసినట్లు శనివారం అధికారులు తెలిపారు. భూకంప బాధితుల కోసం 'స్మృతి వాన్' మెమోరియల్‌కు కేవలం నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న మాదాపూర్‌లో శుక్రవారం సాయంత్రం ఒక వర్గానికి చెందిన సభ్యులు దాడి చేసి, మరొక సామాజిక వర్గానికి చెందిన ప్రార్థనా స్థలాన్ని ధ్వంసం చేశారు. భుజ్ శివార్లలోని మాదాపర్‌కు చెందిన రాబరీ కమ్యూనిటీకి చెందిన వ్యక్తులు పరేష్ రాబారి అనే యువకుడిని శుక్రవారం ఉదయం గొడవ మధ్య సులేమాన్ సనా హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. 'మేం శుక్రవారం సాయంత్రం సులేమాన్ సనాను చుట్టుముట్టాం. ప్రశ్నించిన తర్వాత నిర్ణీత సమయంలో అతన్ని అరెస్టు చేస్తాం. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్న తర్వాత పరిస్థితి సద్దుమణిగింది' అని మాదాపూర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కరణ్‌సిన్హ్ విహోల్ తెలిపారు.

కర్ణాటక మఠాధిపతిపై పోక్సో కేసు

మైసూరు: హైస్కూల్ బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడినందుకు గాను లైంగిక నేరాల బాలల రక్షణ (పోక్సో) చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేసిన ఐదుగురిలో చిత్రదుర్గకు చెందిన ప్రముఖ మఠాధిపతి కూడా ఉన్నారని శనివారం పోలీసు వర్గాలు తెలిపాయి. జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ అధికారి ఫిర్యాదు మేరకు నజర్‌బాద్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. నిందితుల్లో మఠం నిర్వహిస్తున్న హాస్టల్ వార్డెన్ కూడా ఉన్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. ఇద్దరు బాలికల వాంగ్మూలం ఆధారంగా ఫిర్యాదు నమోదు చేశారు. వార్డెన్ తమను రెండేళ్లుగా లైంగిక వేధింపులకు గురిచేస్తున్నాడని, వారికి కొంతమంది సహకరించారని ఆరోపించారు.

బీజేపీ నేతలపైకి బుల్డోజర్లు పంపండి : సీపీఐ

పాట్నా : బీహార్‌లోని బీజేపీ నేతలపైకి బుల్డోజర్లు పంపాలని రాష్ట్రంలోని మహాకూటమి ప్రభుత్వానికి బాహ్య మద్దతిస్తున్న భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) శనివారం సూచించింది. రాష్ట్ర బీజేపీ నేతల అక్రమ సంపాదనపై శ్వేతపత్రం విడుదల చేయాలని సీపీఐ జాతీయ కార్యదర్శి అతుల్ కుమార్ అంజన్ డిమాండు చేశారు. అలా చేస్తే బీజేపీ తప్ప అన్ని పార్టీలు అవినీతిభరితమన్న భావన తొలగిపోతుందని అన్నారు. 'ప్రభుత్వ భూములను ఆక్రమించి నిర్మించిన బీజేపీ నేతల కట్టడాలను గుర్తించి, కూల్చివేయమని సంబంధిత అధికారులకు సీఎం నితీశ్ కుమార్, ఉపముఖ్యమంత్రి తేజస్వీ ప్రసాద్ యాదవ్ ఉత్తర్వులు ఇవ్వాలి. పార్టీకి వ్యతిరేకంగా బుల్డోజర్లను వాడాలి. ఒకవేళ నితీశ్, తేజస్వీ డీలా పడితే అలా చేసేందుకు వారికి నైతిక సాహసం లేదనే భావించాల్సి ఉంటుంది' అని అంజన్ వ్యాఖ్యానించారు. రాష్ట్ర కేబినెట్‌లో భాగస్వామి కావడం కోసం తమ పార్టీ సుముఖంగా ఉన్నదన్నారు. ఇప్పటివరకు తమను ఎవరూ సంప్రదించలేదని, మిత్రపక్షాల ఐక్యతను పణంగా పెట్టి మంత్రిపదవులను ఆశించడం లేదని అంజన్ చెప్పారు. దేశంలోని ప్రతిపక్ష పార్టీలను ఏకం చేయడంలో నితీశ్ కుమార్ కీలకంగా వ్యవహరిస్తారని సీపీఐ నమ్ముతోందని విలేకరుల ప్రశ్నకు బదులిచ్చారు. నితీశ్ కుమార్ ప్రధాని రేసులో ఉండటానికి సంబంధించిన ప్రశ్నలను తోసిపుచ్చారు. బిడ్డ పుట్టకముందే పేరు పెట్టడం తగదని వ్యాఖ్యానించారు. బలహీనపడిన కాంగ్రెస్... బీజేపీకి ధైర్యానిచ్చిందని, ఆ పార్టీ అశ్వమేధ యజ్ఞం బీహార్‌లో నిలిచిపోయిందని, అద్వానీ రథయాత్ర ఆగిందీ ఇక్కడే అని అంజన్ అన్నారు. 1990 అక్టోబరులో సమస్తిపూర్‌లో అద్వానీ రామరథ్ యాత్రకు బీహార్ అప్పటి సీఎం లాలూ ప్రసాద్ యాదవ్ అడ్డుకట్ట వేశారు. ఆర్థిక వ్యవస్థను మోదీ ప్రభుత్వం అస్తవ్యస్థం చేసిందని, విదేశీ మారక రిజర్వులు, రూపాయి పతనం గురించీ ప్రస్తావిస్తూ పక్క దేశం ఆక్రమించిన భూభాగాలపై శ్వేతపత్రం ఇవ్వాలని డిమాండు చేశారు. దేశ ప్రయోజనాల పరిరక్షణకు సీపీఐ కట్టుబడి ఉందని అంజన్ నొక్కిచెప్పారు.

లోదుస్తుల వివాదం... మళ్లీ నీట్ పరీక్ష

తిరువనంతపురం : గత నెలలో నీట్ పరీక్ష సందర్భంగా కేరళలోని కొల్లాంలో 'బాలికల లోదుస్తులు తొలగింపు ఒత్తిడి' వివాదంపై ఎన్‌టీఏ (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభావిత బాలికలకు మళ్లీ పరీక్ష రాసే అవకాశం కల్పించేందుకు సిద్ధమైంది. బాలికలు కోరుకుంటే సెప్టెంబర్ 4న పునఃపరీక్ష నిర్వహిస్తామని తెలియజేస్తూ ఈ-మెయిల్స్ పంపించింది. గత నెలలో నీట్ పరీక్ష సందర్భంగా లోదుస్తులు తొలగించి పరీక్ష కేంద్రంలోకి రావాలంటూ కొల్లాంలో ఓ పరీక్ష కేంద్ర సిబ్బంది బాలికలను ఒత్తిడి చేశారు. ఈ ఘటనపై తీవ్ర దుమారం రేగింది. ఈ వ్యవహారంతో సంబంధమున్న పరీక్షా కేంద్రం సిబ్బంది ఏడుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఆ తర్వాత వీళ్లంతా బెయిల్‌పై విడుదలయ్యారు. లోదుస్తులు తొలగించాలంటూ బాలికలను ఒత్తిడి చేయడంపై తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇన్విజిలేటర్లు అమానవీయ చర్యకు పాల్పడ్డారని, బాలికల మనసుపై దుష్ప్రభావం చూపిందని, ప్రశాంతంగా పరీక్ష రాయలేకపోయారని వాపోయారు. దీంతో ఈ ఘటనపై దర్యాప్తునకు ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీని నీట్ ఏర్పాటు చేసింది. విద్యార్థినులు ఎదుర్కొన్న మానసిక పరిస్థితిపై ఈ కమిటీ దర్యాప్తు జరిపి తుది నివేదికను అందజేసింది. ఈ నివేదిక ఆధారంగా కొల్లాం జిల్లాలో ప్రభావిత బాలికలకు పునఃపరీక్ష నిర్వహించాలని నీట్ నిర్ణయించింది. లోదుస్తులు తొలగింపు ఒత్తిడి చేసిన వ్యవహారంలో మార్ థామస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఐటీకి చెందిన వైస్ ప్రిన్సిపల్, నీట్ ఎగ్జామ్ సెంటర్ సూపరిటెండెంట్ ప్రిజీ కురియన్ ఇసాన్, ఎన్టీఏ అబ్జర్వర్ డా.షమ్నద్ ఉన్నారు. వీరితోపాటు కాలేజీకి చెందిన ఇద్దరు మహిళా స్టాఫ్, స్టార్ ట్రైనింగ్ అకాడమీకి చెందిన మరో ముగ్గురు అరెస్టయినవారిలో ఉన్నారు. ఐపీసీ సెక్షన్ 354, సెక్షన్ 509 కింద వీరిపై కేసులు పెట్టారు.

సీజేఐ పదవిలో లలిత్ 74 రోజులే



న్యూఢిల్లీ: 49వ భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)గా ప్రమాణస్వీకారం చేసిన జస్టిస్ ఉదయ్ ఉమేశ్ లలిత్...100 రోజుల కంటే తక్కువ పదవీకాలం ఉన్న ఆరో ప్రధాన న్యాయమూర్తి కానున్నారు. 74 రోజుల పదవీకాలం ముగిశాక నవంబర్ 8న ఆయన పదవీ విరమణ చేయనున్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు 65 సంవత్సరాల వయస్సులో, హైకోర్టు న్యాయమూర్తులు 62 సంవత్సరాల వయస్సులో పదవీ విరమణ చేస్తారు. ఇంతకుముందు 100 రోజుల కంటే తక్కువ కాలం సీజేఐగా పని చేసినవారిలో జస్టిస్ కమల్ నారాయణ్ సింగ్ (18 రోజులు) -నవంబర్ 25, 1991 నుంచి డిసెంబర్ 12, 1991 వరకు. జస్టిస్ ఎస్ రాజేంద్ర బాబు (30 రోజులు), మే 2, 2004 నుంచి మే 31, 2004 వరకు. జస్టిస్ జేసీ షా (36 రోజులు) డిసెంబర్ 17, 1970 నుంచి జనవరి 21, 1971 వరకు. జస్టిస్ జి.బి.పట్నాయక్ (41 రోజులు) నవంబర్ 8, 2002 నుండి డిసెంబర్ 18, 2002 వరకు. జస్టిస్ ఎల్ఎం శర్మ (86 రోజులు) నవంబర్ 18, 1992 నుంచి ఫిబ్రవరి 11, 1993 వరకు.

వారణాసిలో ఉప్పొంగిన గంగానది

వారణాసి (యూపీ): భారీ వర్షాల కారణంగా వారణాసిలో గంగానది నీటి మట్టం ప్రమాద స్థాయిని మించింది. దీంతో గంగా, దాని ఉపనదుల పరివాహక ప్రాంతాల్లోని వ్యవసాయ క్షేత్రాలు, నివాసాలు నీట మునిగాయి. గంగా, దాని ఉపనది వరుణ వరదల కారణంగా వారణాసి జిల్లాలో 18 మున్సిపల్ వార్డులు, 80కి పైగా గ్రామాలు ప్రభావితమయ్యాయని, జిల్లాలో 228.69 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయని జిల్లా యంత్రాంగం ఒక ప్రకటనలో తెలిపింది. శనివారం ఉదయం 10 గంటల సమయానికి గంగానది నీటిమట్టం 71.26 మీటర్ల ప్రమాదకర స్థాయిని దాటి 71.50 మీటర్లకు చేరుకుందని కేంద్ర జల సంఘం తెలిపింది. 68 గ్రామాలు వరదల వల్ల ప్రభావితమయ్యాయని, 10,104 మంది వరద బాధితులను 18 సహాయ శిబిరాలకు తరలించినట్లు సబ్-డివిజనల్ మేజిస్ట్రేట్ (సదర్) హన్సిక దీక్షిత్ తెలిపారు. వారణాసి జిల్లాలో సదర్, పింద్రా, రాజతలాబ్ అనే మూడు తహసీళ్లు ఉన్నాయి. వరద బాధితులకు ఆహారం, ఇతర నిత్యావసరాలను అందించడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని, జిల్లా పరిపాలన బృందాలు ప్రభావిత ప్రాంతాలలో నిరంతరం పెట్రోలింగ్ చేస్తున్నాయని దీక్షిత్ తెలిపారు. వారణాసి ఎంపీగా ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ గురువారం జిల్లా మేజిస్ట్రేట్ కౌశల్ రాజ్ శర్మ, కమిషనర్ దీపక్ అగర్వాల్‌కు ఫోన్ చేసి వరద పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సహాయక శిబిరాల్లో ఆశ్రయం పొందిన ప్రజలకు అన్ని విధాలుగా సహాయం అందించాలని ఆయన అధికారులను కోరారు. అవసరమైతే నేరుగా ప్రధానమంత్రి కార్యాలయా(పీఎంఓ)న్ని సంప్రదించాలని ఆదేశించారు.

వారిని దత్తత తీసుకునే వారేరి?

- లక్షలాది మంది అనాథ చిన్నారులు వేచి ఉన్నారు...
- ఒక్క బిడ్డ దత్తతకు మూడు, నాలుగేళ్లా!
- ప్రక్రియను సరళీకరించండి
- సుప్రీం కోర్టు వ్యాఖ్య

న్యూఢిల్లీ : దేశంలో లక్షలాది మంది పిల్లలు దత్తత కోసం ఎదురుచూస్తున్నారని, ఒక్క బిడ్డను దత్తత తీసుకోవడానికి సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ (సీఏఆర్ఏ) కింద మూడు నుంచి నాలుగు సంవత్సరాల నిరీక్షణ కాలం ఉన్నందున భారతదేశంలో పిల్లల దత్తత ప్రక్రియను క్రమబద్ధీకరించాల్సిన అవసరం ఉందని సుప్రీం కోర్టు నొక్కి చెప్పింది. అత్యున్నత న్యాయస్థానం కూడా ఈ ప్రక్రియ 'చాలా దుర్భరమైనది, విధివిధానాలను క్రమబద్ధీకరించడం' తక్షణ అవసరం అని పేర్కొంది. 'చాలా మంది యువ జంటలు బిడ్డను దత్తత తీసుకోవడానికి వేచి ఉన్నారు. అయితే ఈ ప్రక్రియ చాలా దుర్భరమైనది, దీనికి మూడు నుంచి నాలుగు సంవత్సరాల సమయం పడుతుంది. సీఏఆర్ఏ ద్వారా ఒకే బిడ్డను దత్తత తీసుకోవడానికి మూడు, నాలుగు సంవత్సరాలు పడుతుంది' అని న్యాయమూర్తులు డివై చంద్రచూడ్, ఎ.ఎస్.బోపన్న, జె.బి.పార్దీవాలాలతో కూడిన ధర్మాసనం కేంద్రం తరపున హాజరయిన అదనపు సొలిసిటర్ జనరల్ కె.ఎం.నటరాజ్‌కు తెలిపింది. 'భారతదేశంలో ఒక బిడ్డను దత్తత తీసుకోవడానికి మూడు నుంచి నాలుగు సంవత్సరాల వ్యవధిని మీరు ఊహించగలరా? దీన్ని మరింత సరళంగా చేయాలి. లక్షలాది మంది అనాథ పిల్లలు దత్తత కోసం వేచి ఉన్నారు' అని వ్యాఖ్యానించింది. దేశంలో పిల్లల దత్తత ప్రక్రియను సులభతరం చేయాలని కోరుతూ ఎన్జీవో దాఖలు చేసిన పిటిషన్‌కు సమాధానం ఇవ్వడానికి ప్రభుత్వం ఆరు వారాల సమయం కోరిందని నటరాజ్ అన్నారు. 'ది టెంపుల్ ఆఫ్ హీలింగ్' అనే స్వచ్ఛంద సంస్థ సూచనలను పరిశీలించి, ఉన్నత న్యాయస్థానంలో దాఖలు చేసేందుకు నివేదికను సిద్ధం చేయమని, అభివృద్ధి మంత్రిత్వ శాఖ నుంచి బాధ్యత వహించే వారిని సమావేశం ఏర్పాటు చేయాలని ధర్మాసనం నటరాజ్‌ను కోరింది. ఏఎస్‌జీకి తన పిటిషన్ పంపిణీ చేయాలని, దత్తత ప్రక్రియను ఎలా సులభతరం చేయాలనే దానిపై మంత్రిత్వ శాఖలోని అధికారులకు తన సూచనలను అందించాలని వ్యక్తిగతంగా హాజరయిన ఎన్జీవో కార్యదర్శి పీయూష్ సక్సేనాను ఇది కోరింది. తదుపరి విచారణను అక్టోబర్‌కు వాయిదా వేసింది. కాగా పిల్లల దత్తత ప్రక్రియ 'చాలా దుర్భరమైనది, విధానాలను క్రమబద్ధీకరించడం తక్షణ అవసరం అని ఆగస్టు 5న సుప్రీం కోర్టు పేర్కొంది. దేశంలో పిల్లలను దత్తత తీసుకునే ప్రక్రియను క్రమబద్ధీకరించేందుకు తీసుకున్న చర్యలను వివరిస్తూ దాఖలైన వ్యాజ్యం పై తన స్పందనను దాఖలు చేయాలని కేంద్రం తరపున హాజరయిన నటరాజ్‌ను కోరింది. 'మేము వ్యాజ్యం పై నోటీసు జారీ చేయడానికి కారణం భారతదేశంలో పిల్లల దత్తత ప్రక్రియ చాలా దుర్భరమైనది. సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ (సీఏఆర్ఏ) వార్షిక సామర్థ్యం 2 వేల దత్తతలను కలిగి ఉంది. ఇది ఇప్పుడు 4 వేలకు పెరిగింది. ఈ దేశంలో అనాథలుగా ఉన్న చిన్నారులు మూడు కోట్ల మంది ఉన్నారు. ప్రక్రియను క్రమబద్ధీకరించడం తక్షణ అవసరం' అని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. పిటిషనర్ సూచనలను పరిగణనలోకి తీసుకుని, ప్రక్రియను క్రమబద్ధీకరించడానికి తీసుకున్న చర్యల గురించి ప్రతిస్పందనను దాఖలు చేయాలని కోర్టు కేంద్రాన్ని కోరింది. ఎన్జీవో ఉద్దేశం గురించి ఇంతకుముందు భయపడ్డామని, అయితే పీయూష్ సక్సేనా పెద్ద కార్పొరేట్ సంస్థలో ఉద్యోగాన్ని వదిలిపెట్టి ఎన్జీవో తరపున హాజరవుతున్నాడని తెలిసిన తర్వాత ఆ కారణాన్ని అనుసరించి నోటీసు జారీ చేసినట్లు పేర్కొంది. ఏప్రిల్ 11న దేశంలో పిల్లల దత్తత కోసం చట్టపరమైన ప్రక్రియను సులభతరం చేయాలని కోరుతూ దాఖలయిన పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీం కోర్టు అంగీకరించింది. దేశంలో ఏటా 4 వేల దత్తతలు మాత్రమే జరుగుతున్నాయని తెలిపింది. ఎన్జీవో తరపున హాజరయిన సక్సేనా, పిల్లల దత్తత ప్రక్రియను సులభతరం చేయాలని కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖకు అనేక ఫిర్యాదులు చేశానని, అయితే ఇప్పటి వరకు ఏమీ జరగలేదని చెప్పడంతో అది కేంద్రానికి నోటీసు జారీ చేసింది. పబ్లిక్ డొమైన్‌లో అందుబాటులో ఉన్న డేటా ప్రకారం సంవత్సరానికి 4 వేల మంది పిల్లలను మాత్రమే దత్తత తీసుకుంటున్నారని, అయితే గత సంవత్సరం వరకు దేశంలో మూడు కోట్ల మంది అనాథ పిల్లలు ఉన్నారని సక్సేనా వివరాలు సమర్పించారు. చాలా మంది సంతానం లేని జంటలు బిడ్డను దత్తత తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నారని ఆయన తెలిపారు. అయితే గత సంవత్సరం, మహమ్మారి సమయంలో మంత్రిత్వ శాఖ నిబంధనలను సడలిస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది. ఇది రోజూ చేయవచ్చని ఆయన అన్నారు. కాగా ఒక సంస్థకు ప్రాతినిధ్యం వహిస్తున్న మీకు దత్తత ప్రక్రియతో సంబంధం ఏమిటో చెప్పాలని సక్సేనాను అత్యున్నత న్యాయస్థానం ప్రశ్నించింది. 'నేను 'ది టెంపుల్ ఆఫ్ హీలింగ్'లో కార్యదర్శిని. మేము విరాళాన్ని స్వీకరించము లేదా ఎటువంటి డబ్బు వసూలు చేయము. ప్రకృతివైద్యం ద్వారా వివిధ వ్యాధులకు చికిత్స అందిస్తాము' అని సక్సేనా చెప్పారు. 2006కు చెందిన ఆదాయపు పన్ను సిద్ధం చేసే పథకం తరహాలో కొంతమంది శిక్షణ పొందిన 'దత్తత సిద్ధం చేసేవారిని' చిన్నారుల దత్తత వనరుల సమాచారం, మార్గదర్శ వ్యవస్థ నియమించవచ్చని ఆయన వివరించారు. కాబోయే తల్లిదండ్రులకు దత్తత తీసుకోవడానికి అవసరమైన పత్రాలను పూర్తి చేయడంలో వారు సహాయపడతారని ఆయన అన్నారు. చట్టం, న్యాయ మంత్రిత్వ శాఖ నోడల్ మంత్రిత్వ శాఖ 1956 నాటి హిందూ దత్తత, నిర్వహణ చట్టం ద్వారా దత్తత తీసుకోబడుతున్నందున శాసనసభ ముందు కూడా అసాధారణత ఉందని సక్సేనా న్యాయస్థానానికి తెలిపారు. అయితే అనాథల అంశాలను మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ పరిష్కరిస్తుంది. 'మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ నన్ను వివరణాత్మక వ్రాతపూర్వక సమర్పణను అడిగింది. దానిని నేను గత మార్చిలో వారికి ఇచ్చాను. కానీ ఇప్పటి వరకు ఎటువంటి చర్య తీసుకోలేదు. పిల్లలు తప్పుడు చేతుల్లోకి వెళతారని వారు ఆందోళన చెందుతున్నందున వారు ఎటువంటి చర్యలు తీసుకోవాలని వారు కోరుకోవడం లేదు' అని ఆయన తెలిపారు.

జయ మరణంపై నివేదిక సిద్ధం

- తమిళనాడు సీఎం స్టాలిన్‌కు సమర్పణ
- తదుపరి చర్యలపై రేపు మంత్రివర్గంతో చర్చ
- అన్ని అంశాలను ప్రస్తావించాం: జస్టిస్ అర్ముఘస్వామి
- 150 మందికి పైగా సాక్షుల విచారణ

చెన్నై: తమిళనాడు దివంగత ముఖ్యమంత్రి జయలలిత మరణానికి సంబంధించిన పరిస్థితులపై విచారణ జరిపిన జస్టిస్ అర్ముఘస్వామి నేతృత్వంలోని కమిషన్... శనివారం తన నివేదికను తమిళనాడు ప్రభుత్వానికి సమర్పించింది. కాగా ఆగస్టు 29న జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ముందుకు ఈ నివేదిక రానుంది. 150 మందికి పైగా సాక్షులను కమిటీ విచారించింది. కమిషన్ రూపొందించిన నివేదికను జస్టిస్ ఎ.అర్ముఘస్వామి ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌కు అందజేశారు. దీనిని బహిరంగపర్చడంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉందని అన్నారు. కాగా ఈ నివేదికపై సోమవారం జరిగే మంత్రివర్గ సమావేశంలో చర్చించి, తగిన చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించినట్లు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రంలో ఏప్రిల్ అధికారంలో ఉన్న డీఎంకే... 2021 అసెంబ్లీ ఎన్నికలకు ముందు జయలలిత మరణానికి దారితీసిన పరిస్థితులపై సరైన విచారణ జరిపి, ఎవరైనా దోషులుగా తేలితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చింది. గత ఏఐఏడీఎంకే ప్రభుత్వం ఏర్పాటు చేసిన అర్ముఘస్వామి కమిషన్ విచారణ నవంబర్ 22, 2017న ప్రారంభమైంది. ముఖ్యమంత్రి స్టాలిన్ నివేదికను అందజేసిన తర్వాత అర్ముఘస్వామి మీడియాతో మాట్లాడారు. దాదాపు 150 మంది సాక్షులను విచారించి 500 పేజీల నివేదికను ఆంగ్లంలో తయారు చేశామన్నారు. తమిళ వెర్షన్ 608 పేజీల వరకు ఉంది. 'ప్రభుత్వం మాత్రమే నివేదికను ప్రచురించడంపై నిర్ణయం తీసుకోగలదు' అని ఆయన అన్నారు. జయలలితకు మరణానికి సంబంధించిన అన్ని అంశాలు నివేదికలో ప్రస్తావించినట్లు పేర్కొన్నారు. ఇది తనకు 'సంతృప్తికరమైన విహారయాత్ర' అని ఆయన అన్నారు. రెండు భాగాలుగా ఉన్న నివేదికలో జయలలిత అనారోగ్యాలు, అలవాట్లతో సహా అన్ని కోణాలను పరిశీలించినట్లు తెలిపారు. జయలలిత చికిత్స కోసం సెప్టెంబర్ 22, 2016న ఇక్కడి అపోలో ఆసుపత్రిలో చేరారు. ఆమె 75 రోజుల పాటు ఆస్పత్రిలో ఉన్న తర్వాత అదే సంవత్సరం డిసెంబర్ 5 న మరణించారు. 'ఎవరిపైనైనా సందేహాలు ఉన్నాయా' అని మీడియా ప్రతినిధులు అడగ్గా, 'అదే నివేదిక' అని అర్ముఘస్వామి దాటవేశారు. నివేదికలోని ప్రత్యేకాంశాలను వెల్లడించడానికి ఆయన నిరాకరించారు.'నేను తక్కువ రాశాను... కానీ సాక్షులు చెప్పినదాన్ని ఎక్కువగా ప్రస్తావించాను' అని ఆయన వివరించారు. 'నేను ప్రతిదీ చెప్పాను...ప్రతిదానికీ సమాధానం చెప్పాను' అని ఒక ప్రశ్నకు సమాధానంగా అన్నారు. జయలలిత మరణించిన మూడు నెలల తర్వాత ఆమె మృతిపై ఢిల్లీలోని ఎయిమ్స్ నివేదికను ఇచ్చిందని జస్టిస్ స్వామి గుర్తు చేశారు. కమిషన్ కోర్టులా పని చేస్తుందని చాలామంది భావించారని, కమిషన్‌ను కొనసాగించేందుకు అనుమతించినందుకు స్టాలిన్‌కు, రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కమిషన్ ముందు హాజరైన సాక్షుల్లో ఏఐఏడీఎంకే అగ్రనేత ఓ పన్నీర్‌సెల్వం, జయలలిత మేనకోడలు దీప, మేనల్లుడు దీపక్, వైద్యులు, ఉన్నతాధికారులు, ఆ పార్టీకి చెందిన సీ విజయభాస్కర్ (మాజీ ఆరోగ్య మంత్రి), ఎం తంబిదురై, సీ పొన్నయన్, మనోజ్ పాండియన్ ఉన్నారు. దీప, దీపక్‌లు తమ అత్త మరణానికి సంబంధించిన పరిస్థితులపై అనుమానాలు వ్యక్తం చేశారు. దివంగత ముఖ్యమంత్రి జయలలితకు ఆప్తురాలు వీకే శశికళ 2018లో తన న్యాయవాది ద్వారా అఫిడవిట్ దాఖలు చేశారు. ఆమె అఫిడవిట్, ఇతర అంశాలతోపాటు జయలలిత ఆసుపత్రిలో చేరడానికి దారితీసిన పరిస్థితులకు సంబంధించినది. ఇటీవలి విచారణలో జయలలితకు అందించిన చికిత్సపై అపోలో హాస్పిటల్స్ వైద్యులు వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ఢిల్లీ ఎయిమ్స్‌కు చెందిన వైద్య నిపుణుల బోర్డుకి వివరించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు వైద్యపరమైన అంశాలను విశ్లేషించడంలో కమిషన్‌కు సహాయం చేయడానికి ఎయిమ్స్ బృందం కూడా విచారణలో పాల్గొంది.

ఆప్ ఎమ్మెల్యే కారుపై దుండగుల దాడి

న్యూఢిల్లీ: ఆమ్‌ఆద్మీ పార్టీ ముస్తఫాబాద్ ఎమ్మెల్యే హాజీ యూనస్‌కు చెందిన కారుపై అసాంఘిక శక్తులు దాడికి పాల్పడ్డాయి. ఈ ఘటన ఈశాన్య ఢిల్లీలోని శాస్త్రి పార్క్ ప్రాంతంలో శుక్రవారం చోటు చేసుకుంది. మద్యం మత్తులో ఉన్న దుండగులు దాడికి పాల్పడ్డారని, ఆ సమయంలో తన కుమారుడు, కుమార్తెలు ఆ కారులో ప్రయాణిస్తున్నట్లు ఎమ్మెల్యే యూనస్ శనివారం పేర్కొన్నారు. 'నా కొడుకు, కూతుళ్లు కూర్చున్న నా కారుపై కొందరు సంఘ వ్యతిరేక వ్యక్తులు దాడి చేశారు... తెల్లటి స్కార్పియో కారులో వచ్చిన మద్యం తాగి ఉన్న ఐదుగురు యువకులు నా కారును ఆపి కుటుంబ సభ్యులతో అసభ్యంగా ప్రవర్తించారు!' అని హిందీలో ట్వీట్ చేశారు. అయితే పోలీసుల కథనం మరోలా ఉంది. శాస్త్రి పార్క్ చౌక్ సమీపంలో తెల్లటి స్కార్పియో కారులో ఉన్న కొందరు వ్యక్తులు మహ్మద్ ఉనేష్ అనే వ్యక్తితో వాగ్వాదానికి దిగిన సంఘటన జరిగిందని, ఇరువర్గాల మధ్య ఎలాంటి గొడవలు, ఘర్షణలు జరగలేదని తెలిపారు. ఘటన జరిగిన సమయంలో ఎమ్మెల్యే హాజీ యూనస్ కారులో లేరని పోలీసులు తెలిపారు. కాగా యూనస్ తన ట్వీట్‌లో ఓ వీడియోను కూడా జోడించారు. అందులో ఎమ్మెల్యే కారు ముందు స్కార్పియో కారు ఆపేసి ఉంది. ఒక వ్యక్తి డ్రైవర్ వైపు కిటికీని కొట్టడం కనిపించింది, దాని తర్వాత వారి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఐపీసీ సెక్షన్‌లు 341, 506, 34 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీనియర్ పోలీస్ అధికారి తెలిపారు. తెల్లటి స్కార్పియో కారు నోయిడాలో రిజిస్టర్ అయినట్లు పోలీసులు తెలిపారు.

విదేశీ పర్యాటకుడిని కాపాడిన ఆర్మీ

జమ్ము: హంగేరియా జాతీయుడిని శనివారం ఆర్మీ అధికారులు రక్షించినట్టు రక్షణ అధికార ప్రతినిధి తెలిపారు. ఈ ఘటన జమ్ము కశ్మీర్‌లోని కిష్త్వార్‌లో చోటు చేసుకున్నట్టు పేర్కొన్నారు. 30 గంటల సుదీర్ఘ గాలింపు చర్యల అనంతరం అతడిని దల్ గ్రామములో గుర్తించినట్టు తెలిపారు. 'అతను హిమాలయాల్లో ట్రెక్కింగ్ చేసే సమయంలో దారి తప్పి సొమ్మసిల్లి పడిపోయాడు. ఉదంపూర్ నుంచి భారత వైమానిక దళం చికిత్స నిమిత్తం అతడిని తీసుకొచ్చింది' అని వివరించారు. తనను కాపాడినందుకు ఆర్మీ సిబ్బందికి హంగేరియా జాతీయుడు కృతజ్ఞతలు తెలిపాడు.

జస్టిస్ రమణపై ఉన్నతస్థాయి విచారణ జరిపించాలి

- హైదరాబాద్ ఐఏఎంఏసీ వ్యవహారంలో న్యాయవాదుల డిమాండ్
- కేంద్రానికి లేఖ
- కాగ్ దర్యాప్తునకూ విజ్ఞప్తి

న్యూఢిల్లీ: భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ శుక్రవారం పదవీ విరమణ పొందారు. న్యాయ వ్యవస్థ బలోపేతానికి తన వంతు కృషిచేశానని ఆయన వీడ్కోలు సభలో చెప్పారు. అంతా ఆయనను ప్రజల న్యాయమూర్తిగా శ్లాఘించారు. ఇంతలోనే పరిస్థితి మారిపోయింది. పదవీ విమరణ పొందిన మరుసటి రోజే జస్టిస్ ఎన్వీ రమణపై ఆరోపణలు గుప్పుమన్నాయి. సీజేఐగా ఆయన తన అధికారాలను దుర్వినియోగించారని కొందరు న్యాయవాదులు, మధ్యవర్తులు విమర్శించారు. తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో ప్రారంభించిన అంతర్జాతీయ మధ్యవర్తిత్వ కేంద్రం (ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ & మీడియేషన్ సెంటర్) (ఐఏఎంసీ) ఏర్పాటు, ప్రచారంలో జస్టిస్ రమణ చట్టవిరుద్ధంగా వ్యవహరించారని ఆరోపణలు చేశారు. 2021,డిసెంబరులో ఐఏఎంసీ ప్రారంభమైంది. మాజీ సీజేఐ రమణ 'చట్టవ్యతిరేక చర్యల'లపై ఉన్నతస్థాయి కమిటీతో విచారణ జరిపించాలని, ప్రాజెక్టు ఆస్తులు, ఆర్థిక లావాదేవీలను కంప్ట్రోలర్, ఆడిటర్ జనరల్ (కాగ్) విచారించాలని కేంద్రప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ ప్రభుత్వ విధానానికి విరుద్ధంగా ప్రభుత్వ నిధులు , ఆస్తులను పెద్ద ఎత్తున దుర్వినియోగం చేసినట్లు ఆరోపిస్తూ అందించిన లేఖపై 65 మంది సంతకాలు చేశారు. ప్రధాన నిందితుడిగా జస్టిస్ రమణను పేర్కొన్నారు. ఆయన తన అధికారాలను దుర్వినియోగించారని, ఐఏఎంసీ కోసం ప్రచారం చేశారని, అది కేంద్రప్రభుత్వ సంస్థగానీ సుప్రీంకోర్టుకు చెందినదిగానీ కాదని, ఆయన వ్యక్తిగతంగా దీనిని స్వచ్ఛంద సంస్థగా ఏర్పాటు చేశారని ఆరోపించారు. విశ్వాస ఒడంబడిక (ట్రస్ట్ డీడ్)ను ఆయన రూపొందించారని, జస్టిస్ ఎల్ నాగేశ్వరరావు, జస్టిస్ ఆర్‌వీ రవీంద్రన్‌ను జీవితకాల ట్రస్టీలుగా , సుప్రీం న్యాయమూర్తి జస్టిస్ హిమా కోహ్లీ, తెలంగాణ న్యాయశాఖ మంత్రి ఎ.ఇంద్రకరణ్‌రెడ్డి ఎక్స్ అఫీషియో ట్రస్టీలుగా నియమితులయ్యారన్నారు. 2021, ఆగస్టు 20న డీడ్ అమలు జరిగింది. అప్పట్లో తెలంగాణ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ కోహ్లీ ఉన్నారు. జస్టిస్ రావు సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా కొనసాగుతుండగా జస్టిస్‌రవీంద్రన్ పదవీ విరమణ పొందారు. మధ్యవర్తిత్వం కోసం ఐఏఎంసీ సేవలను వినియోగించుకోవాలని వ్యాజ్యదారులకు సీజేఐగా జస్టిస్ రమణ అనేక సందర్భాల్లో సూచించడాన్ని న్యాయవాదుల సంఘం ప్రస్తావించింది. ఐపీఎల్ మాజీ చైర్మన్ లలిత్ మోదీ, ఆయన తల్లి బీనా మోదీ మధ్య ఆస్తి వివాదంలోనూ ఐఏఎంసీ సేవలను వినియోగించుకోవాలని జస్టిస్ రమణ సూచించారని పేర్కొంది. తమ రాష్ట్ర ప్రభుత్వ పనులకు సంబంధించి దాని ఒప్పందాలు, టెండర్ల అమలులో తలెత్తే వివాదాల కోసం ఐఏఎంసీని న్యాయనిర్ణేత కేంద్రంగా చేస్తామని తెలంగాణ ప్రభుత్వం ప్రకటించడాన్ని గుర్తుచేసింది. తెలంగాణ ప్రభుత్వం ఏ విధంగా ఐఏఎంసీకి వనరులను సమకూర్చినదో వెల్లడించింది. హైదరాబాద్ శివార్లలో రూ.250కోట్ల విలువైన ఐదెకరాల భూమిని ఇందుకోసం అందించినట్లు తెలిపింది. జస్టిస్ రమణ ఒత్తిడి, ముఖ్యమంత్రితో ఉన్న సాన్నిహిత్యం కారణంగానే ఇదంతా సాధ్యమైందని, ఈ కేంద్రానికి రూ.50 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిందని ఆరోపణలు ఉన్నాయి. సీజేఐగా బాధ్యతలు స్వీకరించే సమయంలోనూ జస్టిస్ రమణపై ఆరోపణలు రావడం యాధృచ్ఛికం. అప్పట్లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఓ లేఖను అప్పటి సీజేఐ బాబ్డేకు పంపడం వివాదాస్పదమైన విషయం విదితమే.

అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న నారాయణ, రామకృష్ణ, రాజా, అనీరాజా, వనజ తదితరులు

మహాసభల ప్రారంభ సూచికగా బెలూన్లు ఎగురవేస్తున్న అనీరాజా, దుర్గాభవాని, జేవీఎస్ఎన్ మూర్తి, ముప్పాళ్ల తదితరులు

సీపీఐ మహాసభలు ఉత్తేజపూరితం

పతాకావిష్కరణ, అమరులకు నేతల నివాళి

విశాలాంధ్ర బ్యూరో– విశాఖపట్నం:

సీపీఐ రాష్ట్ర 27వ మహాసభలు విశాఖపట్నం సిరిపురం ప్రాంతంలోని వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనా (కొల్లి నాగేశ్వరరావు సభా ప్రాంగణం)లో శనివారం ఉత్తేజపూరితంగా ప్రారంభమయ్యాయి. తొలుత పార్టీ పతాకాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ పీజే చంద్రశేఖరరావు ఆవిష్కరించారు. అనంతరం సీపీఐ మహాసభలు జయప్రదం కోరుతూ ముద్రించిన ఎర్ర బెలూన్ల సమూహాన్ని సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యులు డి.అనీరాజా గాలిలోకి వదిలారు. తదుపరి సభా ప్రాంగణం ఎదుట ఏర్పాటు చేసిన అమరవీరుల స్థూపానికి సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ నెక్కంటి సుబ్బారావు నివాళులర్పించారు. అనంతరం వరుసగా సీపీఐ ప్రధానకార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సహాయ కార్యదర్శులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, జేవీ సత్యనారాయణ మూర్తి, కార్యదర్శివర్గ సభ్యులు, కార్యవర్గసభ్యులు, ఆయా జిల్లాల కార్యదర్శులు నివాళులర్పించారు. కె.రామకృష్ణ వక్తలను వేదికపైకి ఆహ్వానించారు. సౌహార్ద ప్రతినిధులుగా హాజరైన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పీవీ సుందరరామరాజు, సీపీఐ ఎంఎల్ నాయకులు పాండా, ఆర్ఎస్‌పీ రాష్ట్ర కార్యదర్శి జానకిరామ్, సీపీఐ లిబరేషన్ రాష్ట్ర నాయకులు హరినాథ్, ఎస్‌యూసీఐ నాయకులు గోవింద రాజుకు స్వాగతం చెపుతూ వేదికపైకి ఆహ్వానించారు. గత మహాసభ నుంచి ఇప్పటివరకు మరణించిన పార్టీ నాయకులు, ప్రముఖులకు సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి సంతాప తీర్మానం ప్రవేశ పెట్టారు. డి.రాజా ప్రారంభ ఉపన్యా సం చేశారు. అధ్యక్షవర్గం, తీర్మానాల కమిటీ, మినిట్స్ కమిటీలను రామకృష్ణ ప్రతిపాదించగా, సభ ఆమోదించింది. అధ్యక్షవర్గ కమిటీ కన్వీనర్‌గా ముప్పాళ్ల నాగేశ్వరరావు, సభ్యులుగా పి.హరినాథ రెడ్డి, ఎ.విమల, కోనాల భీమారావు, సయ్యద్ అప్సర్ ఉన్నారు. తీర్మానాల కమిటీ కన్వీనర్‌గా సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఓబులేసు, సభ్యులుగా మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, నాయకులు అక్కినేని వనజ, రామచంద్రయ్య, జంగాల అజయ్‌కుమార్, పి.దుర్గాభవాని, ఎం.ఎల్ నారాయణ, జి.కోటేశ్వరరావు ఉన్నారు. మినిట్స్ కమిటీ కన్వీనర్‌గా జి.ఈశ్వరయ్య, సభ్యులుగా దోనేపూడి శంకర్, మధు, నాగరాజు, సన్యాసిరావు ఉన్నారు. ఆహ్వానసంఘం అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మానం ఆంజనేయులు అధ్యక్షోపన్యాసం చేశారు. ప్రజానాట్య మండలి రాష్ట్ర నాయకులు చంద్రా నాయక్, పెంచలయ్య, ఆర్.పిచ్చయ్య, నజీర్, గని బృందం ఆలపించిన విప్లవ గేయాలు ఉత్తేజపరిచాయి.

సంతాప తీర్మానం ప్రవేశపెడుతున్న జేవీఎస్ఎన్ మూర్తి

జాతీయ మహాసభలకు మానం ఆంజనేయులు రూ. లక్ష విరాళం

విజయవాడలో అక్టోబరు 14నుంచి 18వ తేదీ వరకు జరుగనున్న సీపీఐ జాతీయ మహాసభల విజయాన్ని కాంక్షిస్తూ మాజీ శాసనసభ్యులు మానం ఆంజనేయులు లక్ష రూపాయల నగదును విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, కార్యదర్శి నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణకు అందజేశారు. విరాళం అందజేసిన మానం ఆంజనేయులుకు వారు అభినందనలు తెలిపారు.

కమ్యూనిస్టుల విలీనంపై కేంద్రస్థాయిలో చర్చలు

- ఐక్య ఉద్యమాలు మరింత బలపడాలి
- సీపీఐ రాష్ట్ర మహాసభల్లో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో–విశాఖపట్నం:

కమ్యూనిస్టు పార్టీల ఐక్యత, విలీనం అనేవి వేర్వేరు అంశాలని, విలీనమనేది కేంద్ర స్థాయిలో చర్చల ద్వారానే సాధ్యమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. విశాఖలో కొల్లి నాగేశ్వరరావు సభాప్రాంగణంలో శనివారం ఉదయం ప్రారంభమైన సీపీఐ రాష్ట్ర ప్రతినిధుల సభలో ఆయన సౌహార్ద ప్రతినిధిగా మాట్లాడారు. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం కార్పొరేట్లకు ఊడిగం చేస్తోందని, కుల, మత విద్వేషాలతో ప్రజలను చీలుస్తూ, ప్రజా ఉద్యమాలను బలహీనపరుస్తూ రాజకీయ లబ్ధే ఏకైక లక్ష్యంగా పని చేస్తున్నదని విమర్శించారు. అన్ని వ్యవస్థలను దుర్వినియోగం చేస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యానికి గురిచేస్తోందని, రాజ్యాంగం ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆస్తులన్నింటినీ తెగనమ్ముతున్నారని, లాభాల బాటలో నడిచే విశాఖ ఉక్కును సైతం ప్రైవేటీకరించేందుకు సాహసించడం మోదీ బరి తెగింపునకు నిదర్శన మన్నారు. రాష్ట్రంలో ఒక్క శాతం ఓట్లు కూడా లేని బీజేపీకి, ఇటీవల మోదీ ప్రతిపాదించిన రాష్ట్రపతి అభ్యర్థికి దేశంలో ఏ రాష్ట్రంలోనూ రాని విధంగా మెజార్టీ ఓట్లు రావడం గమనార్హమన్నారు. ఏపీకి బీజేపీ ప్రభుత్వం ప్రత్యేక హోదాతో పాటు విభజన అంశాల్లో ఏ ఒక్కటీ సక్రమంగా అమలు చేయనప్పటికీ జగన్ ప్రభుత్వం కేంద్రానికి అన్ని విషయాల్లో మద్దతు పలకడం విచారకరమన్నారు. ఎంపీ సీట్లు ఎక్కువ గెలిపిస్తే కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా సాధిస్తానన్న జగన్... భీమవరం సభలో ప్రధాని సమక్షంలో సైతం ఆ అంశాలు ప్రస్తావించలేకపోయారని విమర్శించారు. ఏపీ ప్రయోజనాలను కేంద్రానికి తాకట్టుపెడుతున్నారని, బీజేపీ అడగకుండానే ప్రతి కీలక బిల్లుకు ఆమోదం తెలుపుతున్నారని ఆయన మండిపడ్డారు. బీజేపీ అండతో జగన్ రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగిస్తున్నారని, ఇంకోవైపు నవరత్నాల అమలు పేరుతో ప్రజలపై ఇబ్బడిముబ్బడిగా పన్నుల భారాలు మోపుతున్నారని విమర్శించారు. ఈ నేపథ్యంలో కమ్యూనిస్టుల ఐక్య ఉద్యమాలు మరింత బలపడాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికే అనేక అంశాల పై కలిసి ఉద్యమాలు నిర్వహిస్తున్నప్పటికీ భవిష్యత్తులో జగన్, మోదీకి బుద్ధి చెప్పేందుకు బలమైన ఉద్యమ కార్యాచరణ అవసరమని, ఇందుకు సీపీఎం కట్టుబడి ఉందని శ్రీనివాసరావు స్పష్టం చేశారు. రాష్ట్ర మహాసభలకు హాజరైన సీపీఐ ప్రతినిధులందరికీ సీపీఎం తరపున శుభాకాంక్షలు తెలిపారు.

బీజేపీని సైద్ధాంతికంగానూ ఓడించాలి

ఎన్ఎస్‌యూఐ నేత ఎస్.గోవిందరాజులు

విశాలాంధ్ర–విశాఖ:

బీజేపీని రాజకీయంగానే కాక సైద్ధాంతికంగాను ఓడించాల్సిన అవసరం ఉందని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర నాయకుడు ఎస్.గోవిందరాజులు అభిప్రాయపడ్డారు. సీపీఐ 27వ రాష్ట్ర మహాసభలకు ఆయన సౌహార్ద ప్రతినిధిగా హాజరై మాట్లాడారు. బీజేపీని రాజకీయంగా ఓడించినంత మాత్రాన వామపక్ష ప్రజాతంత్ర శక్తులు బలపడలేవని అన్నారు. బీజేపీ–ఆర్ఎస్ఎస్ ఫాసిస్టు సిద్ధాంతాన్ని ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక రంగాల్లో సైతం ఓడించాలన్నారు. విద్యావ్యవస్థ ద్వారా సంస్కృతిపై దాడి చేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని విమర్శించారు. గుజరాత్ అల్లర్లలో గర్భిణి బిల్కిస్ బానో అత్యాచార నిందితులను ఆగస్టు 15 సందర్భంగా విడుదలచేసినా దేశంలో పెద్దగా ప్రతిఘటన లేకపోవడం అత్యంత విచారకరమని ఆవేదన వ్యక్తంచేశారు. అనేక దేశాల్లో ఆర్థిక, రాజకీయ రంగాల్లో తీవ్ర సంక్షోభం నెలకొందన్నారు. సామ్రాజ్యవాద దేశాల పాలకులు ఈ సంక్షోభ భారాలను ప్రజలపైకి నెడుతున్నారని విమర్శించారు. సామ్రాజ్యవాదం దేశాల మధ్య వైరుధ్యాలు ఉన్నాయని, కొత్త సామ్రాజ్యవాద శక్తులు పుట్టుకొస్తున్నాయని అన్నారు. సోవియట్ యూనియన్ కుప్పకూలిన తరువాత ప్రపంచం తిరోగమనం వైపు పయనిస్తోందని, ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయని, మానవ సంబంధాలు క్షీణిస్తున్నాయని చెప్పారు. ఈ పరిస్థితుల్లో ప్రగతిశీల వామపక్ష ప్రజాతంత్ర ఉద్యమం రావాలని అభిప్రాయపడ్డారు. ఉద్యమాలతోనే కమ్యూనిస్టుల బలం పెరుగుతుందని చెప్పారు.

వామపక్షాల ఐక్యత నినాదం కారాదు

- మత, మితవాద శక్తులను నిలువరించే గురుతర బాధ్యత కమ్యూనిస్టులదే
- ఆహ్వానసంఘం అధ్యక్షుడు మానం ఆంజనేయులు

విశాలాంధ్ర బ్యూరో– విశాఖపట్నం:

ప్రజాస్వామ్యాన్ని, ఫెడరలిజాన్ని కాపాడు కుంటూ దేశంలో పేట్రేగిపోతున్న మతవాద, మితవాద శక్తులను నిలువరించాల్సిన గురుతర బాధ్యత వామపక్ష పార్టీలపైనే ఉందని సీపీఐ రాష్ట్ర మహాభల ఆహ్వానసంఘం అధ్యక్షుడు, మాజీ శాసనసభ్యులు మానం ఆంజనేయులు ఉద్ఘాటించారు. ఆయన ఆహ్వానసంఘ అధ్యక్షోపన్యాసం చేశారు. 1974లో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ 13వ రాష్ట్ర మహాసభలకు విశాఖ వేదికగా నిలిచిందని, దాదాపు 48 సంవత్స రాల తర్వాత మహాసభలు జరగడం, అప్పుడూ, ఇప్పుడూ తాను ఆహ్వానసంఘం అధ్యక్షుడిగా ఉండడం ఆనందంగా ఉందన్నారు. ప్రస్తుత దేశ రాజకీయాలు ఆరెస్సెస్ కనుసన్నల్లో నడుస్తున్నా యని, రాజ్యాంగాన్ని, ప్రజల హక్కులను, లౌకికవాదాన్ని కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ధ్వంసం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో అడ్డుతగులుతున్న ప్రతిపక్ష పార్టీలను నాశనం చేయడానికి పావులు కదుపు తోందన్నారు. రాష్ట్రాల్లో కీలకంగా మారిన ప్రాంతీయ పార్టీల్లో సంక్షోభాలకు బీజాలు వేస్తూ వాటిని తమ చెప్పుచేతల్లోకి తీసుకుంటూ సమాఖ్య వ్యవస్థకు తిలోదకాలు ఇస్తోందని విమర్శిం చారు. కేంద్ర దర్యాప్తు సంస్థలను జేబు సంస్థ లుగా మార్చేసి తమకు గిట్టని నేతలపై దాడులకు, బెదిరింపులకు దిగుతూ రాజకీ యంగా మరింత బలం పుంజుకోవాలని ప్రయత్నిస్తోందన్నారు. ఏకపార్టీ పాలన దిశగా బీజేపీ అడుగులు వేస్తోందని, ఈ ధోరణి కొనసాగితే దేశంలో నియంతృత్వం రాజ్యమేలటం ఖాయమని హెచ్చరించారు. ఇటువంటి సంక్లిష్టమైన ప్రమాదకర ధోరణుల మధ్య వామపక్ష పార్టీలు నిర్వర్తించాల్సిన బాధ్యతలు చాలా ముఖ్యమైనవిగా ఉండాలన్నారు. ప్రాంతీయ పార్టీలేమో కేంద్రంపై పోరాడటానికి ఊగిస లాడుతున్నాయనీ, కేంద్రానికి భయపడి ఎవరికివారే అనే తీరులో వ్యవహరిస్తున్నాయని చెప్పారు. ఈ నేపథ్యంలో కల్సి వచ్చే శక్తుల సంఖ్య తక్కువగానే ఉన్నప్పటికీ వామపక్షాల ఐక్యత కేవలం నినాదానికే పరిమితం కాకుండా, చిత్తశు ద్ధితో ఆచరణాత్మకమైన ప్రణాళికతో విధి విధానా లను రూపొందించుకుని కదిలితే సాధ్యమవుతుం దన్నారు. వామపక్ష పార్టీలకు అనుబంధంగా ఉన్న ప్రజా సంఘాలతో కల్సి ఐక్య వేదికలను నిర్మించి, ప్రజాస్వామ్య శక్తులను కూడగడుతూ, తదనంతరం ప్రజాసంఘాల విలీనానికి కృషి చేయడం అవసరమన్నారు. పెచ్చుమీరిన మత, మితవాద ఫాసిస్టు శక్తులను ఎదిరించి పోరాడలేకపోతే దేశ భవిష్యత్తు అంధకారమవుతుందన్నారు. ఈ వాస్తవాలను గ్రహించి ఈ మహాసభల్లో అన్ని అంశాలను చర్చించి ఆచరణాత్మక కార్యాచరణను రూపొందిస్తారని, 2024 ఎన్నికల్లో మోదీ ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా కమ్యూనిస్టు ఉద్యమం పునరైక్యతకు బాటలు వేసే కార్యాచరణను విజయవాడలో జరగనున్న సీపీఐ జాతీయ మహాసభ నిర్ణయిస్తుందని తాను ఆశిస్తున్నట్లు ఆంజనేయులు చెప్పారు. విశాఖ జిల్లా పోరాట చరిత్రను, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఆయన వివరించారు.

అసమానతలు రూపుమాపేది కమ్యూనిస్టు పార్టీనే

సీపీఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి కూనంనేని

విశాలాంధ్ర బ్యూరో–విశాఖపట్నం:

సమాజంలోని అసమానతలు రూపుమాపేందుకే కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించిందని సీపీఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి, మాజీ శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ సీపీఐ 27వ రాష్ట్ర మహా సభలకు అతిథిగా హాజరైన కూనంనేని ఉద్వేగ భరిత ప్రసంగం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యమని, కమ్యూనిస్టులకు అధికార కాంక్ష లేదన్నారు. అందుకే అధికారంలోకి రాకపోయినా కమ్యూనిస్టులు క్రియాశీల పాత్ర పోషిస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పనితీరు అధ్వానంగా ఉందని విమర్శిం చారు. అధికారంలోకి వస్తే ప్రతి అకౌంట్‌లో రూ.15 లక్షలు వేస్తానని, ఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తానని హామీలిచ్చిన మోదీ... దేశాన్ని అప్పుల ఊబిలోకి దించారన్నారు. 70 సంవత్సరాల్లో భారతదేశం అప్పు రూ.65 లక్షల కోట్లు ఉంటే... మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం 8 ఏళ్లలోనే రెట్టింపు అప్పు చేశారని కూనంనేని విమర్శించారు. ఇక ఉపాధి విషయానికి వస్తే ఒక్క ఉద్యోగం ఇవ్వకపోగా, ఉన్న ఉద్యోగాలను ఊడబెరికారన్నారు. అంబానీ, అదానీలకు పాలెగానిగా మారిన మోదీ... ప్రజా సంపదను వారికి నిలువునా దోచి పెడుతున్నారని మండిపడ్డారు. రైతులు, నిరుద్యోగులు, మహిళలు, కార్మికులు తదితర ఏ వర్గానికీ మోదీ ప్రభుత్వం చేసిందేమీ లేదన్నారు. ఆహార రంగంపై కేవలం 3 లక్షల 60 వేల కోట్లు మాత్రమే కేంద్రం వెచ్చిస్తుండగా, ఇటీవల పారిశ్రామిక వేత్తల రుణాలు ఒక్క దెబ్బతో రూ.11 లక్షల కోట్లు రద్దు చేయడం మోదీ వైఖరిని తేటతెల్లం చేస్తున్నదన్నారు. ప్రజా సమస్యలను పూర్తిగా విస్మరించి, కేవలం రాముడు, రామాలయం పేరుతో ప్రజలను చీలుస్తూ బీజేపీ రాజకీయ లబ్ధి పొందుతోందని, దీనిని ప్రతిఘటించేందుకు కమ్యూనిస్టులు భగత్‌సింగ్, చేగువేరా స్ఫూర్తితో కదన రంగంలోకి దూకాలని కూనంనేని పిలుపునిచ్చారు. బీజేపీ వెంట అవినీతిపరులు, రుణ ఎగవేత దారులు, రేపిస్టులుండగా, కమ్యూనిస్టుల వెనుక స్వాతంత్ర్య ఉద్యమం, ప్రజా పోరాటాల్లో జైళ్లకు వెళ్లి ప్రాణత్యాగాలు చేసిన వారు ఉన్నారని గుర్తు చేశారు. ప్రజా సమస్యలపై నిరంతర పోరు కొనసాగించాలని పిలుపునిచ్చారు.

ఉద్యమాలు ఉధృతం చేయాలి

ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీవీ సుందర రామరాజు

విశాలాంధ్ర–విశాఖ:

వామపక్ష పార్టీల జెండాలు వేరైనా అజెండా ఒకటేనని, ప్రస్తుత రాజకీయాలకు వామపక్ష పార్టీలు ఏకోన్ముఖంగా ప్రత్యామ్నాయం చూపించాలని ఫార్వార్డ్ బ్లాక్ రాష్ట్ర కార్యదర్శి పీవీ సుందర రామరాజు అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలోని కొన్ని రాజకీయ పార్టీలు బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నాయని అన్నారు. గత ఎన్నికల్లో ఓటుకి రూ.2 వేలు చొప్పున పంచిపెడితే, వచ్చే ఎన్నికల్లో రూ.5 నుంచి 10 వేల వరకు ఖర్చు పెట్టేందుకు బూర్జువా రాజకీయ పార్టీలు సిద్ధంగా ఉన్నాయని అన్నారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వామపక్ష పార్టీలు ఉధృతంగా ఉద్యమాలు రూపొందించాలని తెలిపారు.

హామీల అమలుపై బీజేపీని నిలదీయాలి

ఆర్ఎస్పీ కార్యదర్శి జానకిరాములు

విశాలాంధ్ర – విశాఖ:

బీజేపీ దేశంలోకి మతోన్మాదాన్ని చొప్పిస్తోందని ఆర్ఎస్పీ ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జానకి రాములు అన్నారు. సీపీఐ రాష్ట్ర మహాసభలలో సౌహార్ద్ర ప్రతినిధిగా హాజరైన ఆయన మాట్లాడుతూ నల్లధనాన్ని వెలికి తీసి ప్రతి కుటుంబానికి బ్యాంకు అకౌంట్లలో 15 లక్షల రూపాయలు చొప్పున వేస్తానని ప్రధాని మోదీ హామీ ఏమైందని ప్రశ్నించారు. అలాగే ఏటా రెండు కోట్ల మందికి ఉద్యోగాలు ఇస్తానని చెప్పారని గుర్తు చేశారు. ఆ హామీలను పక్కకు పెట్టి ప్రభుత్వ రంగ సంస్థలను ఒకటొకటిగా విక్రయిస్తున్నారని విమర్శించారు. నల్లధనాన్ని వెలికి తీస్తానన్న హామీకి విరుద్ధంగా దేశంలో నల్లధనం మరింతగా పెరిగిందని చెప్పారు. బీజేపీ ఇచ్చిన హామీలపై ప్రజలు నిలదీయాలని అన్నారు. వామపక్షాల ఐక్యత కోసం జాతీయస్థాయిలో వామపక్ష పార్టీలు కృషి చేయాలని అన్నారు.

ప్రస్తుత రాజకీయాలకు ప్రత్యామ్నాయం చూపాలి

లిబరేషన్ రాష్ట్ర నాయకుడు హరినాథ్

విశాలాంధ్ర – విశాఖ:

ప్రస్తుత రాజకీయాలకు వామపక్ష శక్తులు ప్రత్యామ్నాయాన్ని చూపించాల్సిన అవసరం ఉందని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర నాయ కులు డి. హరినాథ్ సౌహార్ద్ర సందేశం ఇస్తూ అన్నారు. సేవ్ డెమోక్రసీ పేరుతో ప్రత్యా మ్నాయ శక్తులుగా ముందుకు రావాలన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. బిజెపి, సంఘ్ పరివార్ మతోన్మాద శక్తుల నుంచి ప్రజలను కాపాడాలని అన్నారు. వామపక్షాలతోనే అది సాధ్యమని చెప్పారు. దేశంలో లౌకిక స్ఫూర్తికి విరుద్ధంగా మత విద్వేషాలను బీజేపీ నాయకులు రెచ్చగొడుతున్నారని చెప్పారు. భిన్న మతాలు ఉన్న మన దేశంలో బీజేపీ వైఖరి ప్రమాదకరమ న్నారు. రాష్ట్రంలో అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీలు బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నాయనీ, మోదీకి దాసోహం అయ్యాయని విమర్శించారు.

మరో రైతు పోరుకు సిద్ధంకండి: రావుల వెంకయ్య

విశాలాంధ్ర బ్యూరో– విశాఖపట్నం:

రైతాంగ సమస్యల పరిష్కారానికి దేశంలో మరో రైతు పోరుకు సిద్ధం కావాల్సిన సమయం ఆసన్నమైం దని అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) అధ్యక్షులు రావుల వెంకయ్య పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర మహసభలను పురస్కరించుకుని శనివారం ప్రతి నిధుల సభలో ఆయన ప్రసంగించారు. రైతు వినాశకర వ్యవసాయ నల్లచట్టాలను వ్యతిరేకిస్తూ ఢిల్లీ సరిహద్దులో ఏడాదికి పైగా సాగిన పోరాటం చరిత్ర సృష్టించిందన్నారు. దిక్కుతోచని స్థితిలో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం వెనక్కి తగ్గి రైతు ఉద్యమానికి మోకరిల్లిందన్నారు. ఇప్పుడు విద్యుత్ సంస్కరణలతో వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు పెట్టాలన్న తలంపుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరో దుస్సాహసానికి పాల్పడు తున్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ విషయంలో రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం మోదీకి తలొగ్గడం దుర్మార్గమన్నారు. మీటర్ల బిగింపు ప్రక్రియ ఆంధ్రాలో ఇప్పటికే మొదలైం దని, రైతుల ఆందోళన తీవ్రమైందని అన్నారు. రాష్ట్రంలో కౌలు రైతుల పరిస్థితి నానాటికీ దిగజారిపోతున్నదన్నారు. కౌలు రైతుల్లో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలే ఎక్కువగా ఉన్నారని, వారిపట్ల ప్రభుత్వ విధానం ఇలాగే కొనసాగితే తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఢిల్లీ రైతు పోరును స్ఫూర్తిగా తీసు కొని రాష్ట్రంలో రైతాంగ, కౌలు రైతుల సమస్యల పరిష్కారానికి మరో ఉద్యమానికి సమాయత్తం కావాలని రావుల వెంకయ్య పిలుపునిచ్చారు.

సామ్రాజ్యవాద శక్తులపై ఐక్యపోరు

ఎంఎల్ రాష్ట్ర నాయకుడు పాండా

విశాలాంధ్ర – విశాఖ:

సీపీఐ ఎంఎల్ రాష్ట్ర నాయకులు గణేశ్ పాండా సౌహార్ద్ర సందేశం ఇస్తూ సామ్రాజ్య వాద శక్తులపై వామపక్షాలు కలిసి పోరాడా లని అన్నారు. ఐఎంఎఫ్ డబ్ల్యూటీవోల తరు వాత కొత్త శక్తులు పుట్టుకొస్తున్నాయని చెప్పారు. దేశంలో ఏటా కోటి 40 లక్షల మంది ఉద్యోగాల కోసం బయటకు వస్తున్నారని చెప్పారు. వారికి ఉపాధి చూపించాల్సిన అవసరం ఉందన్నారు.

ఎగసిన ప్రజాగళం

ఆకట్టుకున్న కళారూపాలు

విశాలాంధ్రబ్యూరో–విశాఖపట్నం:

భారత కమ్యూనిస్టు పార్టీ 27వ రాష్ట్ర ప్రతినిధుల మహాసభలో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి కళాకారులు ఆలపించిన ఉద్యమ గేయాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. ఒకపక్క కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ, మరోపక్క పార్టీ కార్యకర్తల కర్తవ్యాలను గుర్తు చేస్తూ పాడిన గేయాలు, వాటికనుగుణంగా చేసిన నృత్యాలు ప్రతినిధులను చైతన్యపరిచాయి. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చంద్రనాయక్, చిన్నం పెంచలయ్య, ఇప్టా జాతీయ కార్యదర్శి గని, నాయకులు ఆర్. రామకృష్ణ, ఎస్.గురప్ప, పిచ్చయ్య, నజీర్, డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి మారెళ్ల శ్రీనివాసులు, వి.నాగరాజు, శివయ్య, ఎం. సుబ్రమణ్యం, వెంకట రాముడు, డప్పు సూరి తదితర కళాకారులు పాల్గొన్నారు.

ఫొటో ప్రదర్శన

సీపీఐ 26వ మహాసభల నుంచి 27వ మహాసభ వరకు చేపట్టిన ఉద్యమాలపై ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శన ఆకట్టుకుంది. వివిధ జిల్లాల్లో నిర్వహించిన ఆందోళన కార్యక్రమాలను బ్యానర్ల రూపంలో మహాసభల ప్రాంగణంలో ప్రదర్శించారు. పోరాటాల ఫొటోలను చూస్తూ నేతలు గత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

రెడ్‌షర్ట్ వలంటీర్ల సేవలు భేష్

మహా సభలలో రెడ్ షర్ట్ వలంటీర్లు విశేష సేవలు అందించారు. వేదిక అలంకరణ నుంచి బ్యానర్లు, జెండాలు, తోరణాల ఏర్పాట్లలో చురుకైన పాత్ర పోషించారు. ప్రతినిధులకు ఎప్పటికప్పుడు తాగునీరు అందించారు. భోజనాల సమయంలో ప్రతినిధులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సహకారం అందించారు.

రుచికరంగా భోజనాలు

రాష్ట్ర మహా సభలకు హాజరైన ప్రతినిధులకు ఆహ్వాన సంఘం అధ్వర్యంలో రుచికరమైన భోజనాలు ఏర్పాటు చేశారు. తొలి రోజు రాత్రి చేపల కూరతో భోజనాలు వడ్డించారు. రెండవ రోజు మధ్యాహ్నం రుచిక రమైన శాఖాహార, మాంసాహార భోజనం వడ్డించారు.

విశాలాంధ్ర పుస్తక ప్రదర్శనకు విశేష ఆదరణ

సీపీఐ రాష్ట్ర ప్రతినిధుల మహాసభల సందర్భంగా కొల్లి నాగేశ్వరరావు సభా ప్రాంగణంలో విశాలాంధ్ర బుక్ హౌస్ ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనకు విశేష ఆదరణ లభించింది. మార్క్సిజం, పార్టీ సాహిత్యం, ప్రజాసంఘాల చరిత్ర, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలు, రాష్ట్రంలో ప్రాజెక్టులు, పరిశ్రమల వివరాలు తదితర పుస్తకాలను ప్రతినిధులు కొనుగోలు చేశారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.